జలాధివాసంలోకి

# సంగమేశ్వరుడు

➲ సంగమేశ్వరం ఆలయంలోకి ప్రవేశించిన కృష్ణా జలాలు


నీట మునుగుతున్న వేపదారు లింగం

ఆలయంలోకి ప్రవేశించిన వరదనీరు

నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

కర్నూలు | నంద్యాల

బుధవారం | 24 జులై 2024 | పేజీలు 8

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలమ్మ మంగళవారం లోక్‌సభలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు పెద్ద పీట వేశారు. బడ్జెట్‌లో కర్నూలు జిల్లా ఓర్వకల్లు పారిశ్రామిక వాడ పేరును ప్రస్తావించిన ఆర్థికమంత్రి అక్కడ పారిశ్రామికీకరణకు వీలుగా అన్ని మౌళిక వసతుల కల్పనకు నిధులిస్తామని చేసిన ప్రకటనతో జిల్లాకు మంచిరోజులు వస్తాయని భావిస్తున్నారు. సమైక్యాంధ్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబునాయుడు ఓర్వకల్లు వద్ద ఉన్న 33వేల ఎకరాల భూమిలో పారిశ్రామిక క్యారిడార్ ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. 2014-2019 మధ్య కాలంలో జైరాంఇస్పాత్ స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి అడుగులు పడినా ఇప్పటి వరకు ఆ పరిశ్రమలో ఉత్పత్తి ప్రారంభం కాలేదు. 2019-2024 మధ్య అధికారంలో ఉన్న వైకాపా పాలనలోనూ ఈ పారిశ్రామిక నడవాకు సౌకర్యాల కల్పన జరగలేదు. పరిశ్రమలకు అవసరమైన నీటి వనరులే లేకపోవడంతో ఇక్కడ పరిశ్రమలు స్థాపించేందుకు ముందుకు వచ్చిన పారిశ్రామికవేత్తలు తర్వాత రోజుల్లో వెనుకడుగు వేశారు. గడచిన ఐదేళ్లలో కేంద్ర ప్రభుత్వం హైదరాబాద్-బెంగళూరు మధ్య ఇండస్ట్రియల్ క్యారిడార్ ఏర్పాటు చేస్తామని ప్రకటించినా రాష్ట్ర ప్రభుత్వ చొరవ లేకపోవడంతో ఓర్వకల్లు పారిశ్రామిక వాడ పునాది రాయికే పరిమితమైంది. కేంద్రం కోరినంత భూమిని కేటాయించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం కావడంతోనే ఈ పరిస్థితి తలెత్తిందన్న ఆరోపణలు అప్పట్లో వచ్చాయి.

కర్నూలు ,మేజర్‌న్యూస్ బ్యూరో :




- ఓర్వకల్లు పారిశ్రామికవాడలో మౌళిక వసతుల కోసం కేంద్రం నిధులు
- పరుగులు తీయనున్న హైదరాబాద్-బెంగళూరు ఇండస్ట్రీయల్ క్యారిడార్
- అప్పట్లో శంకుస్థాపన చేసిన చంద్రబాబునాయుడు
- త్వరలోనే పన్నెండు వరుసల రహదారి నిర్మాణానికి సన్నాహాలు
- రియల్ ఎస్టేట్‌కు రెక్కలు వచ్చే అవకాశం
- పెద్ద ఎత్తున పరిశ్రమలు తెస్తాం..మంత్రి టిజి.భరత్



# జిల్లాకు మంచి రోజులు





నిర్మాణంలో వున్న జైరాజ్ ఇస్పాత్ పరిశ్రమ

కేంద్ర బడ్జెట్ పై

## సర్వత్ర హర్షం

- ఏపీకి అత్యధిక ప్రాధాన్యత
- కర్నూలు జిల్లాతో పాటు రాయలసీమ వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక నిధులు
- ఓర్వకల్లు పారిశ్రామిక ఇండస్ట్రీ హబ్‌కు ప్రత్యేక నిధులు కేటాయింపు
- కేంద్ర బడ్జెట్ పై హర్షం వ్యక్తం చేసిన ఎన్డీయే కూటమి
- అసంతృప్తి వ్యక్తం చేసిన విపక్షాలు

**కర్నూలు, మేజర్‌న్యూస్‌ప్రతినిధి:** కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం మంగళవారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు పెద్దపీట వేసింది. రాజధాని అమరావతి అభివృద్ధికి రూ. 15వేల కోట్ల ప్రత్యేక నిధులు, పోలవరం ప్రాజెక్టు త్వరితగతిన పూర్తి చేసేందుకు మిగతా 2లో

## నంద్యాల తహశీల్దార్ల పోస్టుల ఖరీదు రూ.2 కోట్లు !

- రూ.కోటిన్నర ధర పలుకుతున్న నంద్యాల అర్బన్
- రూ.50 లక్షలకు పలుకుతున్న నంద్యాల రూరల్
- నంద్యాల నియోజకవర్గ తహశీల్దార్లు ఖరారైనట్లు ప్రచారం
- ఆ ముగ్గురు పై తీవ్ర ఆరోపణలు
- వైసీపీ ముద్రపడిన తహశీల్దార్లకు టీడీపీ పచ్చ జెండా !



నంద్యాల తహసిల్దార్ కార్యాలయం

## శ్రీశైలం డ్యామ్ @842 అడుగులు

**శ్రీశైలం,మేజర్ న్యూస్:** శ్రీశైలం డ్యామ్ మంగళవారం సాయంత్రం 6 గంటల సమయానికి నీటిమట్టం 842.40 అడుగులకు చేరింది.నీటి నిల్వ సామర్థ్యం 62.0510 టీఎంసీలుగా నమోదైంది.ఇదే సమయానికి జూరాల ప్రాజెక్టు నుంచి 1,51,790 క్యూసెక్కుల వరద నీరు మిగతా 2లో



జిల్లాలో 38శాతం

## లోటు వర్షపాతం నమోదు

వార్త 8లో

అస్వస్థతకు గురైన కూలీల ఘటనపై

## జిల్లా వైద్యాధికారి తనిఖీ..

వార్త 7లో

విభజిత ఏపీకి మేలు చేసేదిగా

## కేంద్ర బడ్జెట్

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** విభజిత ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర బడ్జెట్ అనుకూలంగా ఉందని పేర్కొంటూ పలువురు మంగళవారం పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలాసీతా రామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై కొందరు హర్షం వ్యక్తం చేస్తుండగా మరికొందరు విమర్శలు గుప్పిస్తున్నారు. బడ్జెట్‌పై నంద్యాల పార్లమెంట్ ఎంపీ బైరెడ్డి శబరి మాట్లాడుతూ విభజిత ఆంధ్రప్రదేశ్‌కు మేలు చేసే బడ్జెట్ ఇదని, కేంద్ర మంత్రి నిర్మలాసీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై హర్షం వ్యక్తం చేశారు. రాజధాని అమరావతి అభివృద్ధికి రూ. 15వేల కోట్లు ప్రత్యేక సాయం అవసరాన్ని బట్టి అమరావతికి మరిన్ని అదనపు నిధులు,పోలవరం సత్వర నిర్మాణానికి సంపూర్ణ సాయం పోలవరానికి కావాల్సిన నిధులు కేటాయింపు, మిగతా 2లో

# జిల్లాకు మంచిరోజులు

(మొదటి పేజీ తరువాయి)

తాజాగా ఓర్వకల్లు పారిశ్రామిక వాడకు అవసరమైన కనీస మౌళిక వసతులను కేంద్ర ప్రభుత్వం కల్పిస్తుందంటూ ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభ సాక్షిగా చేసిన ప్రకటన కొత్త ఆశలను రేకెత్తిస్తోంది. నీరు, విద్యుత్, రోడ్లతో పాటు ఇతర మౌళిక సదుపాయాలకు అవసరమైన నిధులన్నింటిని కేంద్రం భరిస్తుందంటూ బడ్జెట్ ప్రసంగంలో నిర్మల ప్రకటించడంతో ఉమ్మడి కర్నూలు జిల్లా రూపురేఖలు మారడం ఖాయంగా కనిపిస్తోంది. ఇప్పటికే కృష్ణాజలాలను ఓర్వకల్లు పారిశ్రామికవాడకు తరలించేందుకు ప్రతిపాదనలున్నాయి. దీనిపై గత రెండు ప్రభుత్వాలూ కసరత్తు చేసినా చుక్క నీటిని కూడా తరలించే పని ప్రారంభించలేకపోయారు. 33వేల ఎకరాల సువిశాల ప్రభుత్వ స్థలం అందుబాటులో ఉన్నా పదేళ్లలో అక్కడ అభివృద్ది జాడలు కనిపించకపోవడం జిల్లా చేసుకున్న దురదృష్టమే. ఇక్కడే పది వేల ఎకరాల్లో ఆసియాలో అతి పెద్దదైన సోలార్ ప్రాజెక్టు ఉన్నా పారిశ్రామిక అభివృద్దికి అడుగులు పడలేదు. ఓర్వకల్లు సమీపంలోని గ్రీన్‌కో పవర్‌ప్లాంట్ నిర్మాణం కూడా జరుగుతోంది. ఓర్వకల్లు పారిశ్రామిక వాడకు అవసరమైన మౌళిక వసతుల కల్పనతో పాటు హైదరాబాద్-బెంగుళూరు మధ్య పన్నెండు వర సల రహదారి నిర్మాణానికి కేంద్రం కసరత్తులు చేస్తుండడంతో పారిశ్రామిక అభివృద్ది పరుగులు తీయడం ఖాయమని భావిస్తున్నారు. ఓర్వకల్లు పారిశ్రామికవాడకు సమీపంలోనే విమానాశ్రయం ఉండడం, అలాగే అటు హైదరాబాద్-బెంగుళూరు మధ్య అతి సులభంగా ప్రయాణం చేసే అవకాశాలు ఉన్న నేపధ్యంలో పారిశ్రామికీకరణతో పాటు ఐటి పరిశ్రమ ఏర్పాటుకు కూడా మంచి రోజులు వచ్చే అవకాశం కనిపిస్తోంది. ఓర్వకల్లు పారిశ్రామిక వాడ అభివృద్దికి కేంద్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేయబోతున్న నేపథ్యంలో ఇన్నాళ్లు చతికిలపడిన రియల్ ఎస్టేట్ వ్యాపారానికి కూడా రెక్కలు వస్తాయని భావిస్తున్నారు. ఇప్పటికే కుదేలైన రియల్ ఎస్టేట్ వ్యాపారులు కేంద్ర ప్రకటనతో ఊపిరి పీల్చుకుంటున్నారు.

**పెద్ద ఎత్తున పరిశ్రమలను తీసుకువస్తాం : మంత్రి టి.జి.భరత్ :** ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్‌కు కేంద్ర ప్రభుత్వ ప్రకటనతో ఊపిరి వచ్చినట్లైనని రాష్ట్ర పరిశ్రమల మంత్రి టి.జి.భరత్ అన్నారు. రాష్ట్రంలో తెదేపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పారిశ్రామికవేత్తలు పరిశ్రమల స్థాపనకు ముందుకు వస్తున్నారని ఆయన గుర్తు చేశారు. ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడుపై విశ్వాసంతో పారిశ్రామికవేత్తలు ఆంధ్రప్రదేశ్‌వైపు చూస్తున్నారని ఆయన చెప్పారు. ఇలాంటి పరిస్థితుల్లో కర్నూలు జిల్లా ఓర్వకల్లు పారిశ్రామిక వాడలో మౌళిక వసతుల కల్పనకు కేంద్రం తన బడ్జెట్‌లో పెద్ద పీట వేయడంతో పారిశ్రామికీకరణ మరింత సులభమవుతుందని, మన వారికి మన దగ్గరే ఉద్యోగాలు లభిస్తాయని ఆయన అన్నారు. ఎన్నికల సమయంలో పరిశ్రమలు తీసుకువచ్చి ఇక్కడి యువతకు ఇక్కడే ఉద్యోగాలు కల్పిస్తానంటూ ఇచ్చిన హామీని నిలబెట్టుకునే వైపుగా తన ప్రయాణం సాగుతోందని ఆయన చెప్పారు.

## శ్రీశైలం డ్యామ్ @842 అడుగులు

(మొదటి పేజీ తరువాయి)

శ్రీశైలం డ్యామ్‌కు చేరింది.మరో మూడు రోజుల్లో తుంగభద్ర జలాలు శ్రీశైల జలాశయాన్ని తాకనున్నట్లు డ్యామ్ అధికారులు తెలిపారు.

## జలాదివాసంలోకి సంగమేశ్వరుడు

**కొత్తపల్లి, మేజర్‌న్యూస్:** శ్రీశైల జలాశయంలోకి ఎగువ ప్రాంతాల నుంచి వరదనీరు అధికంగా వచ్చి చేరుతుండడంతో సప్తనదుల సంగమంలో వెలసిన సంగమేశ్వర ఆలయం జలాదివాసంలోకి వెళ్లనుంది. మంగళవారం సంగమేశ్వర ఆలయంలోకి వరద జలాలు ప్రవేశం చాయి. జలాశయంలో నీటిమట్టం 845 అడుగులకు పైగా వచ్చి చేరడంతో గర్భగుడిలోకి ప్రవేశించి ఆలయంలో ఉన్న వేపదారు శివ లింగం పూర్తిగా మునిగిపోయింది. ఆలయం చుట్టూ నీరు చేరుకొని దీవంలా మారింది. ఇదేవ వరద రెండు రోజులు కొనసాగితే 865 అడుగుల నీటిమట్టం దాటితే ఆలయ శిఖర భాగం మొత్తం మునిగి నీటిలో మునిగిపోతుంది. దీంతో కొన్ని నెలలపాటు పూజలు అందక సంగమేశ్వర ఆలయం నీటి లోనే మునిగి ఉండనుంది. ఆలయ పురోహితులు తెలకపల్లి రఘురామ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేపదారు శివలింగానికి అభిషేకించి మహా మంగళ హారతులు ఇచ్చారు. నదీ జలాలకు పూజలు చేసి చీరె సమర్పించి హారతులిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఏడాది 8 నెలలపాటు నీటిలో మునిగి ఉంది నాలుగు నెలలే పూజలు జరిగేవన్నారు. కానీ ఈ ఏడాది డిసెంబర్ నెలలో ఆలయం పూర్తిగా బయటపడి 8 నెలలపాటు 36 సోమవారాలు ఆలయంలో నిత్య పూజలు జరిగినట్లు తెలిపారు. ఇదే వరద కొనసాగినట్లయితే రెండు, మూడు రోజుల్లో సంగమేశ్వర ఆలయం పూర్తిగా నీటమునిగే అవకాశం ఉందన్నారు.



ఆలయం చుట్టూ చేరిన వరదనీరు

## మంత్రి లోకేష్ ను కలిసిన ఆళ్లగడ్డ ఎమ్మెల్యే

**ఆళ్లగడ్డ,మేజర్ న్యూస్ :**

ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ మంగళవారం విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను కలిశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తన సోదరుడు ఆళ్లగడ్డ తాలూకా యువ నాయకులు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి లు మంత్రి నారా లోకేష్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆళ్లగడ్డ నియోజక వర్గం అభివృద్ధి గురించి చర్చించినట్లు తెలిసింది.



(మొదటి పేజీ తరువాయి)

నిధులతోపాటు రాయలసీమ జిల్లాలతోపాటు ఉత్తరాంధ్ర వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి నిధులు విడుదల చేస్తామని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగంలో స్పష్టం చేశారు. అలాగే హైదరాబాద్- బెంగుళూరు కారిడార్‌లోని ఓర్వకల్లు ఇండస్ట్రీయల్ హబ్‌లో విద్యుత్, తాగునీరు, రోడ్ల నిర్మాణానికి నిధులు కేటాయించారు. గత పదేళ్ల క్రితం రాయలసీమ వెనుకబడిన జిల్లాలకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు ఇచ్చేది. ఆ తర్వాత వెనుకబడిన జిల్లాలకు కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించలేదు. ఏపీలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మరోసారి వెనుకబడిన జిల్లాలకు నిధులు కేటాయిస్తూ కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రకటించింది. రాయలసీమ ముఖద్వారమైన ఉమ్మడి కర్నూలు జిల్లాకు ప్రత్యేక నిధులు దక్కనున్నాయి. ఇండస్ట్రీయల్ హబ్‌కు మౌళిక సదుపాయాల కల్పనకు నిధులు కేటాయిస్తూ పారిశ్రామిక అభివృద్ధికి కేంద్రం పెద్దపీట వేయనుంది. ఈ బడ్జెట్‌పై జిల్లాలో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఏపీకి పెద్దపీట వేస్తూ ప్రకటించిన బడ్జెట్‌పై ఎన్డీయే కూటమి పార్టీలు హర్షం వ్యక్తం చేస్తూ స్వాగతించగా.. విపక్ష పార్టీలు అసంతృప్తిని వ్యక్తం చేశాయి. కేంద్ర బడ్జెట్‌పై ఎవరు ఏమన్నారంటే..!

# కేంద్ర బడ్జెట్‌పై సర్వత్రా హర్షం

**ఏపీపై కేంద్ర ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి నిదర్శనం ఈ బడ్జెట్: కునిగిరి నీలకంఠ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు :** వికసిత భారత్‌లో భాగంగా ఆంధ్ర రాష్ట్రానికి నరేంద్ర మోదీ నాయక త్వంలో ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఏపీ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వడం శుభ పరిణామం. ఏపీ రాజధానికి లైన్ క్లియర్ చేస్తూ ప్రత్యేక నిధుల కేటాయింపు, పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసేందుకు అదనపు నిధులు, రాయలసీమ, ఉత్తరాంధ్ర, ప్రకాశం జిల్లాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయింపు, ఓర్వకల్లు ఇండస్ట్రీయల్ హబ్‌కు నిధుల కేటాయింపును స్వాగతిస్తున్నాం. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో రాష్ట్రం పారిశ్రామికంగా ఆర్థికాభివృద్ధి వైపు పరుగులు తీస్తుంది. జిల్లా ప్రజల తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నాం.



కునిగిరి నీలకంఠ

**కేంద్ర బడ్జెట్ అంకెల గారడీ బడ్జెట్: కె.బాబురావు, కాంగ్రెస్ పార్టీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు :** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్ అంకెల గారడీ బడ్జెట్. ఇది బడ్జెట్‌లా లేదు ఎన్నికల మేనిఫెస్టోలా ఉంది. అమరావతి రాజధాని నిర్మాణానికి నిధులు ఇస్తామని, పోలవరంపై ఎన్నో కబుర్లు చెప్పారు. ఎంత ఇస్తారో స్పష్టంగా చెప్పలేదు. వెనుకబడిన ప్రాంతాలకు నిధులు ఇస్తామని చెప్పారే తప్పా ఎంత నిధులు ఇస్తారో చెప్పలేదు. ప్రత్యేక హోదా ఊసే లేదు. రాష్ట్రానికి లక్ష కోట్లు కావాలని కోరితే.. రూ.15వేల కోట్లు ఇచ్చి మోసం చేశారు. రాష్ట్రానికి చేసిన అన్యాయంపై ఎన్డీయే ప్రభుత్వానికి టీడీపీ మద్దతు ఉపసంహరించుకోవాలి.



కె.బాబురావు

**మాటల్లో చూపిన శ్రద్ధ కేటాయింపుల్లో లేదు: గౌస్ దేశాయ్, సీపీఎం జిల్లా కార్యదర్శి :** కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్ చూసిన తర్వాత కేటాయింపుల్లో లేదు. రాష్ట్రానికి మంచి రోజులు వస్తాయని ఆశించిన ప్రజలకు కేంద్ర బడ్జెట్ నిరాశకు మిగిల్చిందీ. అమరావతి నిర్మాణం కోసం రూ.15కోట్ల నిధులు నేరుగా ప్రకటించకుండా వివిధ సంస్థల తరపున అప్పుగా ఇప్పిస్తామని చెప్పడం హాస్యస్పదం. దీని వల్ల ఇప్పటికే ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతున్న రాష్ట్రాన్ని మళ్లీ ఆర్థిక ఊబిలోకి నెట్టడమే అవుతుంది. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి, విభజన హామీలకు కట్టుబడి ఉంటామని చెప్పిన కేంద్ర మంత్రి నిధులు ఎందుకు కేటాయించలేదు. బడ్జెట్ సంఘంలో ప్రత్యేక హోదా, కడపహుక్కు హామీల ఊసే లేదు. పారిశ్రామిక కారిడార్‌కు నిధుల కేటాయింపును ప్రస్తావించి ఎంత నిధులు ఇస్తున్నారో చెప్పలేదు. ఇప్పటికైనా రాష్ట్రంలోని టీడీపీ, జనసేన పార్టీలపై కేంద్రంపై ఒత్తిడి తేవాలి.



గౌస్‌దేశాయ్

**వెనుకబడిన జిల్లాలకు బుందేల్‌ఖండ్ తరహాలో నిధులు కేటాయించాలి: గిడ్డయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి :** కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రంలోని వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక నిధులు కేటాయిస్తామని చెప్పడం జరిగిందని, అయితే ఎంత బడ్జెట్ కేటాయిస్తారన్నది స్పష్టతనివ్వలేదు. రాయలసీమ, ఉత్తరాంధ్ర, ప్రకాశం వెనుకబడిన జిల్లాలకు గతంలో మాదిరి రూ.50కోట్లు ఇస్తే సరిపోదని, బుందేల్‌ఖండ్ తరహాలో నిధులు కేటాయించాలి. అమరావతి రాజధానికి రూ.15వేల కోట్లను కేటాయించడం స్వాగతిస్తున్నాం. పోలవరం ప్రాజెక్టు పూర్తి చేస్తామంటే సరిపోదని, నిర్వాసితులకు పరిహారం ఇచ్చి ఆదుకోవాలి. బడ్జెట్‌లో నిధుల కేటాయింపు మొక్కుబడిగా కాకుండా పూర్తిస్థాయిలో కేటాయింపులు జరపాలి.



గిడ్డయ్య

**కేంద్ర బడ్జెట్‌లో నిధుల కేటాయింపు హర్షణీయం: సోమిశెట్టి వెంకటేశ్వర్లు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి :** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆంధ్ర ప్రదేశ్‌కు అధిక నిధులు కేటాయించడం హర్షణీయం. గత ఐదేళ్లలో అప్పటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రానికి కేంద్రం నుంచి నిధులు రాబట్టడం లో పూర్తిగా విఫలమయ్యారు. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తక్షణమే ప్రధాన మంత్రి, కేంద్ర మంత్రుల ను కలిసి రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను వివరించి తోడ్పాటు ఇవ్వాలని కోరిన నేపథ్యంలో నిధుల కేటాయింపు జరిగింది. రాజధాని అమరావతి నిర్మాణానికి రూ.15వేకోట్ల నిధులు కేటాయించడం హర్షించదగ్గ పరిణామం. పోలవరం నిర్మాణానికి, ఓర్వకల్లు ఇండస్ట్రీయల్ కారిడార్ అభివృద్ధికి నిధులు కేటాయించడాన్ని స్వాగతిస్తున్నాం. ప్రధానమంత్రి నరేంద్రమోడీ, ఆర్థికశాఖ మంత్రి నిర్మలాసీతారామన్‌కు ధన్యవాదాలు.



సోమిశెట్టి వెంకటేశ్వర్లు

**కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి పెద్దపీట: చింతా సురేష్‌బాబు, ఉమ్మడి కర్నూలు జిల్లా జనసేన పార్టీ కో-ఆర్డినేటర్ :** కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పెద్దపీట వేస్తూ నిధులు కేటాయించారు. రాజధాని అమరావతి నిర్మాణానికి రూ.15వేల కోట్లు, పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన నిధులు కేటాయించడం హర్షణీయం. పారిశ్రామిక రంగానికి పెద్దపీట వేయడం హర్షించదగ్గ విషయం. అలాగే వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు, ఓర్వకల్లు ఇండస్ట్రీయల్ కారిడార్‌లో మౌళిక వసతుల కల్పనకు నిధుల కేటాయింపును స్వాగతిస్తున్నాం. ఇన్‌కమ్ ట్యాక్స్ స్లాబ్‌లను సరళీకరించడంతో ఎంతో సంతోషకరం. రాష్ట్రానికి మరిన్ని నిధులు కేటాయిస్తామని చెప్పడం శుభపరిణామం. ప్రధాని మోడీ, ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌లు ధన్యవాదాలు.



చింతా సురేష్‌బాబు

**ప్రత్యేక హెదా ప్రస్తావనే లేదు ..సిట్ర నారాయణమ్మ.. వైసిపి కర్నూలు జిల్లా అధ్యక్షురాలు :** కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ నిరాశజనకంగా ఉంది. బడ్జెట్లో ప్రత్యేక హెదా విభజన హామీల ప్రస్తావన లేకపోవడం బాధాకరం. తెలుగుదేశం పార్టీ ప్రత్యేక హెదా కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి. అలాగే అమరావతి రాజధాని నిర్మాణానికి 15 వేల కోట్ల రూపాయల నిధులు ఇస్తామని ప్రకటించిన అందులో స్పష్టత లేదు. ఆ నిధులు వివిధ సంస్థల ద్వారా అప్పు ఇస్తామని ప్రకటించడం ద్వారా రాష్ట్రం మరింత ఆర్థిక భారం పడుతుంది. రాజధానికి కేటాయించే నిధులు గ్రాంట్ రూపంలో కేంద్రం ఇవ్వాలి. రాష్ట్రానికి కేంద్రం ద్వారా లక్ష కోట్ల రూపాయలు చంద్రబాబు నాయుడు కోరిన కేవలం 15 వేల కోట్ల రూపాయలు ఇవ్వడం బాధాకరం. రాష్ట్రానికి నిధుల కేటాయింపులో స్పష్టత కరువైంది.



# ప్రోటోకాల్ పాటించని మత్స్యశాఖ

**– ఎంపిపిని పక్కకు కూర్చోబెట్టిన అధికారులు**
**– చేపల వేలంపాటలో అధికారుల ఇష్టారాజ్యం**
**– వాయిదాపడ్డ వేలాలు**

**కోసిగి, మేజర్‌న్యూస్:** మండల పరిషత్ అధ్యక్ష పదవిలో ఉన్న మండల అధ్యక్షుడ్ని పక్కన కూర్చోబెట్టి చేపల వేలంపాటను చేపట్టిన మత్స్యశాఖ అధికారులు చేపట్టిన సంఘటన చోటుచేసుకుంది. మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటుచేసి మండల అధ్యక్షుడు అధ్యక్షతన చేపట్టకుండా మత్స్యశాఖ అధికారులు వేలంపాటలో ఇష్టానుసారంగా వ్యవహరించడంతో వేలంపాటలు వాయిదా పడ్డాయి. కోసిగి సమీపంలో ఉన్న పులికనుమ ప్రాజెక్టులోని చేపల వేలంపాటకు మత్స్యశాఖ అధికారులు మంగళవారం మత్స్యశాఖ అధికారి నాగరాజు ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ వేలంపాట విషయాన్ని ఇరుపార్టీ నాయకులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా వేలంపాట ఎలా నిర్వహిస్తారని, వేలంపాటదారులు మత్స్యశాఖ అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. దీనితో కొంచెంసేపు మత్స్య శాఖ అధికారులకు, వేలంపాటదారులకు వాదోప వాదాలు జరిగాయి. దీనీతో మత్స్యశాఖ అధికారి పై అధికారులను సంప్రదించి పంచా యితీ వేలాలను వాయిదావేయడం జరిగింది. అలాగే ఎంపిపి లవ కుశ ఈరన్న అధ్యక్షతన చేపట్టకుండా ఎంపిపినే పక్కనకూర్చోపెట్టి వేలంపాటలు నిర్వహించిన మత్స్యశాఖ అధికారులుపై తీవ్రవిమర్శలు వినిపించాయి.


ఎంపిపిని పక్కకు కూర్చోబెట్టిన మత్స్యశాఖ అధికారులు



## నాటుసారా స్థావరాలపై పోలీసులు దాడులు

**హొళగుంద, మేజర్‌న్యూస్ :** హొళగుంద మండలం నెరణికి తాండ గ్రామంలో కొండ గుహలోని నాటు సారా స్థావరాలపై మంగళ వారం ఎస్ఐ పెద్దయ్యనాయుడు, పోలీసులు దాడులు చేపట్టారు. సారాను తయారు చేసి బిందెల్లో నిల్వ ఉంచిన 800 లీటర్ల ఊటను ధ్వంసం చేసి 10 లీటర్ల సారాను సీజ్ చేశారు. దాడులో పోలీసులు పెద్దయ్య, వేణుగోఫాల్, జనార్ధన్ పాల్గోన్నారు.


నాటు సారాను ధ్వంసం చేస్తున్న ఎస్ఐ, పోలీసులు

# దేశ విద్యార్థి యువతకు ఆదర్శప్రాయుడు చంద్రశేఖర్ ఆజాద్

**ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రంగస్వామి**

**కోడుమూరు, మేజర్‌న్యూస్ :** భారతదేశ విద్యార్థి యువతకు ఆదర్శప్రాయుడు, స్వాతంత్ర సమరయోధుడు చంద్రశేఖర్ ఆజాద్ అని ఎఐయస్యఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రంగస్వామి అన్నారు. చంద్రశేఖర్ ఆజాద్ 118 వ జయంతి వేడుకలను మంగళవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో అఖిలభారత విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ఆజాద్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి బి.రంగస్వామి మాట్లాడుతూ మధ్యతరగతి కుటుంబంలో పండిట్ సీతారాం తివారికి, అగరాణిదేవికి, చంద్రశేఖర్ ఆజాద్ జన్మించారు. తమ కొడుకుని సాంస్కృతంలో పెద్ద పండితుని చేయడానికి కాశీలో చదివించాలని పట్టుదల ఉండేది. కానీ ఆ పిల్లవాడికి చదువు పూర్తిగా అబ్బలేదు. చదువుకోవడానికి తల్లిదండ్రులు చేసిన ఒత్తిడిని భరించలేక తన పదమూడవ ఏటా ఇల్లు వదలి ముంబాయి పారిపోయాడు. ముంబాయిలో ఒక మురికివాడలో నివసించాడు. బ్రతకడానికి కూలి పని చేశాడు. అనేక కష్టాలు పడ్డాడు. అయినా ఇంటికి వెళ్లాలనిపించ లేదు. ఇంతటి కష్టాల కన్నా సాంస్కృతంలో చదవడం మేలనిపించింది. రెండేళ్ల ఆ మురికి వాడలో నికృష్టమైన జీవనం తర్వాత 1921 లో వారణాసికి వెళ్లిపోయి అక్కడ సంస్కృత పాఠశాలలో చేరిపోయాడు. అదే సమయంలో భారత స్వాతంత్ర్యం కొరకు "మహాత్మా గాంధీ" చేస్తున్న సహాయ నిరాకరణోద్యమంతో దేశం యావత్తు అట్టుడికినట్టున్నది. అప్పుడే చంద్రశేఖర్ ఆజాద్ తాను కూడా భారతదేశానికి సంపూర్ణ స్వాతంత్రం రావడం కొరకు ఏదో ఒకటి చేయాలని నిర్ణయించుకున్నాడు. అప్పుడు అతని వయస్సు పదిహేనేళ్ళ మాత్రమే, ఉత్సాహంగా తాను చదువుతున్న సాంస్కృత పాఠశాల ముందే ధర్నా చేశాడు. కావున చంద్రశేఖర్ ఆజాద్ ఆశయ సాధన కోసం విద్యార్థి యువత మేల్కొని ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ జయంతి వేడుకలలో ఏఐఎస్ఎఫ్ మండల నాయకులు అల్తాఫ్ విజయ్ మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

## గుండమ్మ కుటుంబాన్ని సబ్ కలెక్టర్, డీఎస్పీ పరామర్శ

**– శాంతిభద్రతల విఘాతం కలిగించే ఎంతటి వారినైనా ఊపేక్షించేది లేదు**
**– సబ్ కలెక్టర్, డీఎస్పీ**


గుండమ్మ కుటుంబాన్ని పరామర్శిస్తున్న సబ్ కలెక్టర్, డిఎస్పీ

**ఆదోని, మేజర్‌న్యూస్ :** శాంతిభద్రతల విఘాతం కలిగించే ఎంతటి వారినైనా ఊపేక్షించేది లేదని ఆదోని సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ, డిఎస్పీ శివ నారా యణ స్వామి పేర్కొన్నారు. మంగళవారం ఆదోని మండలం నాగనాథనహళ్ళి గ్రామంలో ఈనెల 12వ తేదిన భూవివాదంలో దళిత మహిళ గుండమ్మ హత్య జరిగిన నేపథ్యంలో వారి ఇంటికి వెళ్ళి గుండమ్మ కుటుంబాన్ని ఆదోని సబ్ కలెక్టర్, డిఎస్పీలు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఘటన పాల్పడిన వారిపై ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకుందని తెలిపారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన పరిహారాన్ని అందేలా చర్యలు తీసుకుంటామని, వారి కుటుంబానికి హామీ ఇచ్చారు. అదేవిధంగా గ్రామంలో ఏటువంటి ఆవాంఛనీయ సంఘటనలు జరగకుండా వారి కుటుంబానికి భద్రత కలిగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ హసీనా సుల్తానా, రెవిన్యూ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధిలో కొండను త్రవ్వి ...

# ఎలుకను పట్టారు

**– ఉపాధి హామీ పథకంలో భారీ అక్రమాలు**


ఉపాధి అక్రమాలపై ఫిర్యాదు చేస్తున్న గ్రామ ప్రజలు

**కొత్తపల్లి, మేజర్‌న్యూస్:** జాతీయ గ్రామీణ హామీ పథకంలో జరిగిన అక్రమాలను సామాజిక తనిఖీ బృందం సభ్యులు కొండను త్రవ్వి ఎలుకను పట్టుకుందన్న చందంగా మారింది. మండలంలోని 12 గ్రామ పంచాయితీల్లో ఉపాధి హామీ పథకంలో భారీ అక్రమాలు చోటు చేసుకున్నప్పటికీ నామమాత్రంగానే తనిఖీలు చేపట్టినట్లు మండల ప్రజలు వాపోయారు. అక్రమాలను వెలికి తీయాల్సిన సామాజిక తనిఖీ బృందం స్థానిక ఉపాధి హామీ సిబ్బందితో కుమ్మక్కై నామమాత్రంగా విచారణ చేపట్టినట్లు సమాచారం. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ జవహార్ బాబు ఆధ్వర్యంలో 17వ సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహించారు. మండలంలో 1.4.2003 నుండి 31.3.2024 వరకు జరిగిన ఉపాధి పనులపై గత 10 రోజులుగా ఎస్ఆర్‌పీ ఆధ్వర్యంలో 12 మంది డీఆర్‌పీలు గ్రామ స్థాయిలో తనిఖీలు నిర్వహించి గ్రామ సభలు నిర్వహించారు. వీటిపై జిల్లా పీడీ రామచంద్రా రెడ్డి, జిల్లా విజిలెన్స్ అధికారి బాలాజీ నాయక్, ఏపీడీ అన్వర్ భేగ్ సమక్షంలో డీఆర్‌పీలు గ్రామాల వారిగా చేసిన పనులపై వివరించారు. గత ఏడాది కాలంగా ఉపాధి పనులకు సంబంధించి రూ.9కోట్ల 27లక్షల 95వేల పనులు చేపట్టడం జరిగిందన్నారు. ఇందులో కేవలం రూ.2లక్షల 2వేలు మాత్రమే అవినీతి జరిగిందని గుర్తించడం పట్ల విమర్శలకు దారితీసింది. గోకవర ంలో రూ.8,778లు, ముసలిమడుగు రూ.36వేలు, వీరాపురం రూ.52వేలు, నందికుంట రూ.10వేలు, గువ్వలకుంట్ల రూ.19వేలు, దుద్యాల రూ.71వేలు, ఎదురుపాడు రూ.4వేలు, కొత్తపల్లి రూ.13వేలు, కొక్కరంచ రూ.13వేలు, శివపురం రూ.4వేలు, గుమ్మడాపురం రూ.1 వెయ్యిలు, ఎర్రమఠం రూ.16వేలు అవినీతి జరిగినట్లు వారు గుర్తించారు. ఈ సామాజిక తనిఖీ నామమాత్రంగా చేపట్టడంతో మండల అధికారులు సామాజిక తనిఖీ బృందానికి భారీ స్థాయిలో నగదు ముట్టజెప్పినట్లు సమాచారం. ఉపాధి కార్యాలయంలో పనిచేస్తున్న ఓ అధికారే ఈ వ్యవహారాన్ని నడిపినట్లు పలువురు చర్చించుకుంటున్నారు. మండలంలో జరిగిన అవినీతి అక్రమాలపై మరోసారి జిల్లా అధికారులు విచారణ చేపట్టి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో జడ్‌పీటీసీ సోమల సుధాకర్ రెడ్డి, ఏపీఓ రేష్మ, వివిధ శాఖల అధికారులు, గ్రామ పంచాయితి సర్పంచ్‌లు పాల్గొన్నారు.

## నేటితో ముగియనున్న నామినేషన్ల ప్రక్రియ

**కర్నూలు నగరం, మేజర్‌న్యూస్:** నగర పాలక సంస్థ స్థాయి సంఘం సభ్యులకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ బుధవారంతో ముగియనుంది. అయితే మంగళవారం మరో మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. వాటిలో 31వవార్డు కార్పొరేటర్ మిద్దె చిట్టెమ్మ, 3వవార్డు కార్పొరేటర్ షేక్‌షాజహాన్‌పర్వీన్, 50వవార్డు కార్పొరేటర్ షేక్ అహమ్మద్‌లు తమ నామినేషన్ పత్రాలను నగర పాలక సంస్థ కార్యాలయంలో అందజేశారు. ఇప్పటి వరకు నామినేషన్లు దాఖలు చేసిన వారి సంఖ్య 12కు చేరింది. ఈ నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ బుధవారం మధ్యాహ్నం 3.00గంటలకు ముగుస్తుంది. అనంతరం అభ్యర్థుల జాబితాను విడుదల చేస్తారు. గురువారం నామినేషన్ల పరిశీలన జరుగుతుందని అడిషనల్ కమిషనర్ పివి.రామలింగేశ్వర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ చిన్నరాముడు, సిబ్బంది శ్రీకాంత్ పాల్గొన్నారు.

## జగన్ శవ రాజకీయాలు మానుకో

**– టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల నాగేంద్ర**

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్:** జగన్ మోహన్‌రెడ్డి రాజకీయ లబ్దికోసమే శవ రాజకీయాలు చేస్తున్నారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల నాగేంద్ర ఆరోపించారు. వినుకొండలో జరిగిన ఇద్దరు వ్యక్తుల వ్యక్తిగత కక్ష్యలతో జిలాని అనే వ్యక్తి రషీద్ అనే వ్యక్తిని హత్య చేయడం అందరికీ తెలిసిన విషయమే. వీరిద్దరు వైసీపీ పట్టణ అధ్యక్షుడు పీస్‌ఖాన్ శిష్యులు అన్నారు. ఈ హత్యను రాజకీయ స్వార్థం కోసం జగన్ వాడుకుంటున్నారని అన్నారు. ఎన్‌డీఏ ప్రభుత్వాన్ని అస్థిరపరచి రాష్ట్రంలో పెట్టుబడులు, పరిశ్రమలు రాకుండా అడ్డుకోవడానికి కుట్రనే అన్నారు. జగన్ పద్ధతి మార్చుకోకుంటే 11 సీట్లలో ఒకటి మాత్రమే మిగులుతుందన్నారు.


మాట్లాడుతున్న నంద్యాల నాగేంద్ర

# చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదు

**– జిల్లా వ్యాప్తంగా విస్తృత దాడులు**

**నంద్యాలక్రైం, మేజర్‌న్యూస్ :** జిల్లాలో ఎవరైనా నాటుసారా తయారి, రవాణ, విక్రయాలకు పాల్పడినా, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా హెచ్చరించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ ప్రవీణ్ కుమార్ పర్యవేక్షణలో సోమవారం జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలలో పోలీసు అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించి దాడులు చేశారు. వాహనాలను తనిఖీ చేసి అనుమానితులను విచారించారు. నాటుసారా స్థావరాలపై దాడిచేసి రెండు కేసులు నమోదుచేసి 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. మధ్యం సేవించి వాహనాలు నడిపే 16మందిపై కేసులు నమోదు చేసి అరెస్టు చేశారు. కొలిమిగుండ్ల స్టేషన్ పరిధిలోని తిమ్మనాయుని పేట సమీపంలో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో సీఐ గోపినాథ్ దాడులు నిర్వహించి 8మందిని అరెస్టు చేసి నగదును స్వాధీనం చేసుకున్నారు. అలాగే మట్కా కేసు నమోదు చేసి నగదు స్వాధీనం చేసుకున్నారు. జిల్లావ్యాప్తంగా 207 ఎంవీ కేసులు నమోదు చేసి రూ.79వేల జరిమానా విధించారు.


వాహనాలను తనిఖీ నిర్వహిస్తున్న త్రీటౌన్ సీఐ నరసింహులు

## ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్సాహంగా శిక్షా సప్తాహ్


పరిశీలిస్తున్న దృశ్యం

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్:** జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షా సప్తాహ్ కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి శ్యామ్యూల్ అన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జాతీయ విద్యావిధానం ప్రవేశపెట్టి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు మంగళవారం డీఈవో తాండ్రపాడులోని మోడల్ ఫౌండేషన్ పాఠశాలను సందర్శించారు. ఇక్కడి విద్యార్థులు అభ్యసనను పరిశీలించారు. ఆయన వెంట డైట్ ప్రిన్సిపాల్ వసుంధరదేవి, డైట్ ఉపాధ్యాయులు రఫి, కో–ఆర్డినేటర్ దావీద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



### అమ్మో ఆత్మకూరా...

# చెత్తకుప్పలు, మురికి కుంటలే



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్:** సాంకేతికత కొత్తపుంతలు తొక్కుతు నగరాలు, పట్టణాలు అభివృద్ధి చెంది అకర్షనీయంగా, అందంగా తయారవుతుంటే ఆత్మకూరు పట్టణం మాత్రం ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా చెత్తకుప్పలు, మురికికుంటలతో దర్శనమిస్తుంది. ఆత్మకూరు మున్సిపాలిటికి ఎన్ని గ్రేడ్‌లు పెరిగినా ఏముందు గర్వకారణం. ఎక్కడ చూసినా చెత్తదిబ్బలు, మురికి కుంటలతో వామ్మో ఆత్మకూరా ... అని భయాందోళన చెందే దుస్థితిలో ఉంది. అసలే వర్షకాలం, దీనికి తోడు మున్సిపల్ కార్మికులు చెత్తను తొలగించకపోవడంతో వర్షపునీరు చేరుకొని మురుగు విస్తరించి దుర్గంధాన్ని వెదజల్లుతుండడంతో రోగాలు భారిన పడే ప్రమాదం లేకపోలేదు. ఇప్పటికే లోతట్టు ప్రాంతాల్లో వర్షపునీరు చేరుకొని ఎక్కడికి వెళ్ళలేక అక్కడే మురికి కుంటలుగా మారుతూ దుర్గంధాన్ని వెదజల్లుతున్నాయి. నీటిని తొలగించాలని మున్సిపల్ అధికారులకు చెప్పినా కంటితుడుపు చర్యలతో చేతులు దులుపుకున్నారంటూ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మురికికుంటలలపై దోమలు విస్తరించడంతో చీకిటి పడేతే చాలు కుదురుగా ఒక్కచోట నిలబడలేని పరిస్థితి, రాత్రుల్లో కంటిపై కునుకు కరువైందని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. పరిశుభ్రత పాటించండి సీజనల్ వ్యాధుల నుంచి రక్షించుకోండి అని డ్రైడే, ఫ్రైడే లాంటి



పట్టణంలో కూరుకపోయిన చెత్త

కార్యక్రమాలు పేపర్లకు, ఫోటోలకు పరిమితమవుతున్నాయని ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు. దోమల నివారణకు తీసుకోవాల్సిన కనీస

- చెత్తను తొలగించండీ సారూ... అంటూ పట్టణ ప్రజల గగ్గోలు
- చెత్తబుట్టలు ఇచ్చారూ... చెత్తను తీసుకెళ్ళడం మరిచారు
- మున్సిపల్ అధికారులు, కార్మికులు ఏమి చేస్తున్నారో మరి
- డంపుయార్డు లేదంటున్న మున్సిపల్ అధికారులు

చర్యలు కూడా మున్సిపల్ అధికారులు తీసుకోవడం లేదని, వార్డు కౌన్సిలర్ ఉన్నా లేనట్టే అంటూ ఆయా వార్డు ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తడి, పొడి చెత్తను విడివిడిగా వేయాలని ప్రతి ఇంటికి చెత్త బుట్టలు ఇచ్చారే కాని ఆ చెత్తను తీసుకె ళ్ళడం లేదంటూ , ఇంటింటికి తిరిగి చెత్తను సేకరించే కార్మికులు ఏమి చేస్తున్నారో తెలియడం లేదని, ఈవిషయాన్ని మున్సిపల్ అధికారులకు తెలిపినా ఫలితం లేదంటూ ప్రజలు విమర్శిస్తున్నారు. ఉదయం, మధ్యాహ్నం విధులకు హాజరతున్నట్లు మస్టర్లు వేస్తున్నారు సరే మరి కార్మికులు ఎక్కడ పనిచేస్తున్నారో అధికారులే చెప్పాలని, చేస్తే పట్టణమంతా ఎక్కడి చెత్త అక్కడే ఎందుకు ఉందో అది కూడా అధికారులు చెప్పాల్సి ఉందంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. బయటకు రావాలన్నా, పట్టణంలో తిరగాలన్నా దుర్గంధాన్ని తట్టుకోలేక ముక్కు మూసుకోని వెళ్లాల్సిన పరిస్థితి ఉందని ప్రజలు వాపోతున్నారు. ఈ విషయాన్ని అధికారులకు తెలియజేస్తే డంపు యార్డు లేదని, చెత్త ఎక్కడ వేయాలో తెలియడం లేదంటూ, ఊరిబయట ఎక్కడ పడితే అక్కడ డంపు చేయాల్సి వస్తుందని చెబుతున్నారు. వర్షపు పడితే ట్రాక్టర్లు ఊరి బయటకు వెళ్ళవని, అందుకు చెత్తను తొలగించలేకపోతున్నామని నిర్లక్ష్య సమాధానం ఇస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆత్మకూరు మున్సిపాలిటి ప్రజలు రోగాలతో మంచం పట్టకముందే చెత్తను తొలగించి పట్టణ ప్రజల ప్రాణాలకు భరోసా ఇవ్వాలని, పట్టణాన్ని అందంగా తీర్చిదిద్దకపోయినా పర్వాలేదు కాని పరిశుభ్రంగా ఉంచడంపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

## గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి

**కల్లూరు, మేజర్‌న్యూస్:** గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని కల్లూరు ఎంపీడీవో చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని తడకనపల్లె, బస్తిపాడు, చిన్నటేకూరు గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఆధార్ క్యాంపులను తనిఖీ చేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. ట్యాంకులను క్లోరినేషన్ చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్డీ రవికిషోర్, తడకనపల్లె సర్పంచ్ సాహెరాబీ, పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఆధార్‌క్యాంపును పరిశీలిస్తున్న ఎంపీడీవో

## ఎస్పీని కలిసిన చింతా సురేష్‌బాబు



ఎస్పీతో చింతాసురేష్‌బాబు

**కర్నూలు సిటీ, మేజర్‌న్యూస్:** కర్నూలు జిల్లా నూతన ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన జి.బింధు మాధవ్‌ను మంగళవారం ఉమ్మడి కర్నూలు జిల్లా జనసేన పార్టీ కో-ఆర్డినేటర్ చింతా సురేష్‌బాబు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో శాంతిభద్రతల విషయంలో జనసేన పార్టీ తరపున సంపూర్ణ సహకాం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పిబివి.సుబ్బయ్య, మంజునాథ్, బజారి, షబ్బీర్, సుమలత పాల్గొన్నారు.

## ఘనంగా బాలగంగాధర తిలక్ జయంతి

**ప్యాపిలి, మేజర్‌న్యూస్ :** పట్టణంలోని స్థానిక శ్రీసరస్వతీ శిశుమందిరంలో మంగళవారం బాలగంగాధర్‌తిలక్ జయంతి వేడుకలను ప్రధానాచార్యులు డి.రామాంజినేయులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బాలగంగాధర్‌తిలక్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రధానాచార్యులు డి.రామాంజినేయులు మాట్లాడుతూ బాలగంగాధర్‌తిలక్ అతివాద నాయకుడని, స్వతంత్య సమరయోధుడని, గణేష్ ఉత్సవాలను ప్రారంభించారని, మరాఠ పత్రికను ప్రారంభించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో శ్రీ సరస్వతీ శిశుమందీర్ ఆచార్యులు, బాలబాలికలు పాల్గొన్నారు.



తిలక్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ప్రధానాచార్యులు, ఆచార్యులు, విద్యార్థులు

## కబుర్ల గారడీ బడ్జెట్

### డోన్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గార్లపాటి మద్దులేటిస్వామి

**డోన్‌రూరల్, మేజర్‌న్యూస్:** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కేవలం కబుర్ల గారడీ బడ్జెట్ అని డోన్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గార్లపాటి మద్దులేటిస్వామి అన్నారు. మంగళవారం స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏపికి ప్రత్యేక హోదా, ప్రత్యేక ప్యాకేజీ, విశాఖ, రైల్వే జోన్, కడప స్టీల్‌ప్లాంట్, విజయవాడ, విశాఖ మెట్రో ప్రాజెక్ట్, పోలవరం ప్రాజెక్ట్ నిర్వాసితుల సమస్యలను ప్రస్తావించకపోవడం దారుణమన్నారు. కేవలం రూ.15వేల కోట్లు విడుదల చేశామని గొప్పలు చెప్పుకోవడమే గాని ఆ నిధులతో ఏపి ఎక్కడా కూడా అభివృద్ధి జరగదని, ఏపిలో అభివృద్ధి జరగాలంటే రూ.12లక్షల కోట్ల నిధులు అవసరముందన్నారు. బీహార్ 12 ఎంపిలను ఇస్తే రూ.26వేల కోట్లు ఇవ్వడం, ఏపి 25 మంది ఎంపిలను ఇస్తే కేవలం కంటితుడుపుగా రూ.15వేల కోట్లు ఇవ్వడం సిగ్గుచేటన్నారు. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ బీజేపి ఎన్నికల మేనిఫెస్టోలాగా ఉందన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు యు.జనార్ధన్, వై.శేఖర్, నాగరాజు, హుస్సేన్‌వలి, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గార్లపాటి మద్దులేటిస్వామి

## పండ్ల తోటల సాగుతో రైతుల ఆర్థికాభివృద్ధి



పండ్ల మొక్కలు అందజేస్తున్న దృశ్యం

**తుగ్గలి, మేజర్‌న్యూస్:** గ్రామీణ ప్రాంతాల్లో రైతులు పండ్ల తోటలు సాగు చేసి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని మాజీ జడ్పీటీ చైర్మన్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బత్తిన వెంకటరాముడు అన్నారు. మంగళవారం మండలంలోని రామలింగయ్యపల్లి గ్రామంలో ఉపాధి హామీ పథకం పండ్ల తోటల సాగు చేసే రైతులకు మాజీ జడ్పీ చైర్మన్ బత్తిన వెంకటరాముడు పండ్ల మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బత్తిన వెంకటరాముడు మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో పండ్ల తోటలు సాగు చేస్తే రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారన్నారు. రైతుల అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ పథకాల ద్వారా రాయితీలు పొంది రైతులు తమ పంటుల సాగు చేసుకొని ఆర్థికంగా వృద్ధి చెందాలన్నారు. అర్హత ఉన్న ప్రత ఇరైతులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎమ్మెల్యే కేఈ శ్యామ్‌కుమార్ రైతుల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రంగమ్మ, సర్పంచ్ సలహాదారుడు వెంకటపతి, టీడీపీ నాయకులు బత్తిన దేవేంద్ర, బత్తిన కిరణ్‌కుమార్, నెరజాల చంద్రశేఖర్, వెంకటరాముడు, ఏపీవో రామక్రిష్ణ, టెక్నికల్ అసిస్టెంట్ పదిరప్ప, రైతులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ప్రాధాన్యత

**కల్లూరు, మేజర్‌న్యూస్:** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి ప్రాధాన్యత కల్పించారని బీజేసీ ఓబీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చామకూర వీరప్ప, బీజేపీ నంద్యాల జిల్లా ఉపాధ్యక్షుడు తారకేశ్వరుడు, మండల అధ్యక్షుడు గంగాధర్ అన్నారు. మంగళరం కల్లూరు మండల బీజేపీ కార్యాలయంలో వారు విలేఖరులతో మాట్లాడారు. భారతదేశం అభివృద్ధి వేగంగా జరుగుతుందన్నారు. మోడీ భారతదేశానికి ప్రధాని కావడం వల్ల దేశప్రజలంతా సంతోషంగా ఉన్నారన్నారు. మన ఆంధ్రప్రదేశ్ తెలుగింటి కోడలు ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారాం ఏడుసార్లు బడ్జెట్‌ను ప్రవేశపెట్టారన్నారు. రాజధాని అమరావతి నిర్మాణం కోసం రూ.15వేలకోట్లు కేటాయించడం హర్షణీయమన్నారు. మోడీ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధికి సహకారాలు అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మదనమోహన్‌ఆచారి, కోనేటి వేణుయాదవ్, వీరమ్మ, లక్ష్మినారాయణ, రవికుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

# ప్రజల నుంచి వినతులు స్వీకరించిన కోట్ల



వినతులు స్వీకరిస్తున్న కోట్లసూర్యప్రకాష్‌రెడ్డి

**కర్నూలు, మేజర్‌న్యూస్‌ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు మంగళవారం మంగళగిరి తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు, డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి రాష్ట్ర నలుమూలాల నుంచి వచ్చిన ప్రజల నుంచి, పార్టీ కార్యకర్తల నుంచి వినతులు స్వీకరించారు. కొన్ని సమస్యలను సంబంధితాదికారుల దృష్టికి తీసుకెళ్లి అక్కడికక్కడే పరిష్కరించారు. మిగతా సమస్యలను పార్టీ అధినేత చంద్రబాబు దృష్టికి, సంబంధిత మంత్రులు, వివిధ శాఖల అధికారులకు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డిని కలవడానికి ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి కోడుమూరు, కర్నూలు, డోన్, మంత్రాలయం, ఎమ్మిగనూరు, ఆలూరు, పత్తికొండ, ఆదోని నియోజకవర్గాల నుంచి టీడీపీ నేతలు పెద్ద ఎత్తున పార్టీ కేంద్ర కార్యాలయానికి తరలివచ్చారు.

# గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి : నాసరరెడ్డి

- ఇంటి నిర్మాణ పనులను వేగవంతం చేయాలి
- హౌసింగ్ పీడీ సిద్ధ లింగమూర్తి

**ఓర్వకల్లు, మేజర్‌న్యూస్ :** గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని జడ్పీ సీఈఓ నాసర రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో మల్లేశ్వరి ఆధ్వర్యంలో పంచాయతీ సెక్రటరీ సచివాల ఇంజనీరింగ్ అసిస్టెంట్లు లతో గ్రామాల్లో నెలకొన్న పారిశుధ్యం గృహ నిర్మాణాలపై సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో మాట్లాడుతూ గ్రామాలలో ఓవర్ హెడ్ ట్యాంకులను మురికి కాలువలను 15 రోజులకు ఒకసారి శుభ్రం చేయాలని శుభ్రపరచిన తేదీలను రిజిస్టర్లో నమోదు చేయాలని ఏ క్షణమైన ఏ గ్రామ నైనా సందర్శి స్తానని గ్రామాలలో పరిశుద్ధ పనులు చక్కగా ఉండాలని ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలని అన్నారు. వర్షాకాలం కావున సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం మండల పరిధిలోని కన్నమడకల గ్రామాన్ని సందర్శించి పారిశుధ్య పనులను ఓవర్ హెడ్ ట్యాంక్ ను పరిశీలించారు.

**డిసెంబర్ లోపు గృహ నిర్మాణాలు పూర్తవ్వాలి**

గృహ నిర్మాణాలను వేగవంతం చేసి డిసెంబర్ లోపు పూర్తిచేయాలని హౌసింగ్ పీడీ సిద్దలింగమూర్తి హౌసింగ్ అధికారులను వర్క్ ఇన్స్పెక్టర్లని ఇంజనీరింగ్ అసిస్టెంట్లను ఆదేశించాడు. మండల వ్యాప్తంగా బేస్మెంట్ రూఫ్ లెవెల్ ఆగిపోయిన నిర్మాణాలను లబ్ధిదారులతో మాట్లాడి వేగవంతం చేయాలనితెలిపారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలో మొక్కలను నాటారు ఈ కార్యక్రమంలో డిఎల్ పి ఓ తిమ్మక్క ఎంపీపీ తిప్పన్న జడ్పిటిసి రంగనాథ్ గౌడ్ ఎంపీడీవో మల్లేశ్వరి ఈ ఓ ఆర్ డి సుబ్బరాయుడు హౌసింగ్ డీఈ హౌసింగ్ ఏఈ రామయ్య ఏపీ ఓ కుమార్ సాయినాథ్ పంచాయతీ సెక్రటరీలు ఇంజనీరింగ్ అసిస్టెంట్లు హౌసింగ్ వర్క్ ఇన్స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.



# క్రీడాకారులు జాతీయస్థాయిలో రాణించాలి

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** క్రీడల్లో జాతీయస్థాయిలో రాణిస్తున్న అర్షుఅంజు నంద్యాల టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఫిరోజ్‌ను ఆయన కార్యాలయంలో కలిశారు. ఈసందర్భంగా ఫిరోజ్ మాట్లాడుతూ చాలా మంది అమ్మాయిలు ఆటలు అంటేనే వెనుకబడుగు వేస్తారని తల్లిదండ్రుల ప్రోత్సాహం అంతా ఉండదని అందులోను ఇతరులతో ముఖాముఖి తలపడే క్రీడల వైపు మొగ్గుచూపేవారు చాలా తక్కువగా ఉంటారన్నారు. ఆటలో దూకుడు ( పదర్శిస్తూ కుస్తీ, హాఆకీ, పవర్ లిఫ్టింగ్, అద్భుత ప్రతిభ చాటుతూ జాతీయస్థాయిలో రాణిస్తూ పతకాలు ప్రశంసలు అందుకుంటున్న అర్షు అంజును అభినందించారు. క్రీడల్లో కాకుండా చదువులో కూడా మంచి ప్రతిభ చూపుతుందన్నారు.



క్రీడాకారినిని అభినందిస్తున్న ఫిరోజ్

# ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి తనిఖీ

**కర్నూలు క్రైమ్, మేజర్‌న్యూస్:** స్టాప్ డయేరియా కార్యక్రమం నిర్వహణపై కేంద్ర బృందం ప్రభుత్వ సర్వజన వైద్యశాలను మంగళవారం తనిఖీ చేసింది. ఎస్ఎన్‌సీయూ, ఎన్ఆర్‌సీ, ఐపీ, ఓపీ వార్డులను తనిఖీ చేశారు. అనంతరం గార్గేయపురం పరిధిలోని పాఠశాల, అంగన్‌వాడి కేంద్రం, పంచాయతీ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. కేంద్ర బృందంలో డాక్టర్ విశాల్, విజయ్‌కుమార్ ఉన్నారు. కేంద్ర బృందం వెంట జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి భాస్కర్, పీడియాట్రిక్ హెచ్‌ఓడీ విజయానందబాబు, డీఎస్‌వో నాగప్రసాద్‌బాబు, డాక్టర్‌జయలక్ష్మి, ఎస్‌వో హేమసుందరం ఉన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న దృశ్యం

# క్రీడాకారులను అభినందించిన డీఎస్‌డీవో

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్:** కర్నూలులో జరిగిన రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్, జూనియర్ అంతర్ జిల్లా ఈత పోటీల్లో పథకాలు సాధించిన క్రీడాకారులను మంగళవారం జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు ప్రత్యేకంగా అభినందించారు. కర్నూలు క్రీడాకారులు దేవవ్రుత్‌సాయి, వర్ణిక, షేక్‌సామియాతనజిమ్, లహరి, చిరుచరణ్‌తేజ్‌లను అభినించారు. మున్ముందు జాతీయ, అంతర్జాయతీ పోటీల్లో పతకాలు సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకరావలని ఆకాంక్షించారు.

# మూడునాళ్ల ముచ్చటగా..

# లెడ్ రోప్ లైట్స్..!

ప్రజా అవసరాలకు వెచ్చించాల్సిన ధనాన్ని కమీషన్ల కోసం... ఎమ్మెల్యేల ప్రాపకం కొరకు ఖర్చు చేసి 'షోపుటప్' చేశారు ఆ ఉన్నతాధికారి. నాసిరకం పరికరాలకు వర్షం కూడా తోడుకావడంతో మూడునాళ్లకే ఆయన నిర్వాకం వల్ల రూ.10లక్షల ప్రజాధనం బూడిదలో పోసిన పన్నీరుగా మారింది. వివరాల్లోకి వెళితే...



అక్కడక్కడ వెలుగుతున్న రోప్‌లైట్స్

- నెలలోపే అటకెక్కిన రోప్ లైట్స్
- ఎమ్మెల్యేల ప్రాపకం కోసం రూ.10లక్షలు వృథా
- అధిక ధరకు రోప్‌లైట్స్ కొనుగోలు

**ఎమ్మిగనూరు, మేజర్‌న్యూస్‌ః**

ఎమ్మిగనూరు పురపాలక సంఘం పరిధిలోని రెండు బైపాస్ రోడ్లలో ఉన్న సెంట్రల్ లైటింగ్ స్తంభాలకు ' లెడ్ రోప్ లైట్స్'ను చుట్టించి ఆ రోడ్లను జిగేల్ మనేలా తయారు చేయించారు ఆ..అధికారి. ఇందు కోసం రూ. 10లక్షలు వెచ్చించారు. అప్పట్లో కొత్తగా ఎమ్మిగనూరుకు వచ్చిన ఆ...అధికారి అప్పటి ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి మెప్పు కోసం అనేక 'షోపుటప్'లు చేయగా అందులో రోప్ లైట్స్ కూడా ఒకటి. గతంలో అన్నమయ్య సర్కిల్ నుండి మార్కెట్ యార్డ్ వరకు, అలాగే పట్టణ ప్రధాన రహదారుల్లోని సెంట్రల్ లైటింగ్ స్తంభాలకు రూ. 5లక్షలు ఖర్చు చేసి రోప్ లైట్స్ వేయించారు. అవి పట్టుమని రెండు నెలలు తిరక్క ముందే అన్నీ అటకెక్కాయి. సంవత్సరం పాటు కాంట్రాక్టర్ వాటి నిర్వాహణను చూసుకోవాలని టెండర్లలో నిబంధన ఉన్నా ఆ కాంట్రాక్టర్‌తో మిలాఖత్ వల్ల వాటిని తిరిగి మరమ్మత్తు చేయించలేక మసిపూసి మారడకాయ చేశారు. ఇక జూన్ 4వ తేది ఎమ్మెల్యేగా గెలుపొందిన డాక్టర్ బీవీ.జయనాగేశ్వరరెడ్డిని ప్రసన్నం చేసుకునేందుకు గాను ఆఘుమేఘాలపై అన్నమయ్య సర్కిల్ నుండి శివ సర్కిల్ వరకు మరో రూ. 5లక్షలు వెచ్చించి రోప్‌లైట్స్ ఏర్పాటు చేయించారు. ఈ రోప్‌లైట్స్ వెలుగులో ఆదోని–కర్నూలు బైపాస్ రోడ్డు జిగేల్‌మంటూ వెలిగిపోయింది. కానీ ఆ వెలుగులు ఎన్నాళ్లో వెలగక మూడునాళ్ల ముచ్చటగానే మిగిలింది. నెల కూడా కాకమునుపే సగానికి పైగా రోప్‌లైట్స్ వెలగడంలేదు. కొన్ని సగం వెలుగుతుండగా మరికొన్నింటికి బలుపులే ఎత్తిపోయాయి. ఇళ్లల్లో పైకప్పుకు చేయించే 'పీఓపీ'లకు వేయించే ఇలాంటి రోప్‌లైట్స్ పరిస్థితి కూడా ఇంతే. అలాంటిది ఆరు బయట...అదీ వర్షకాలంలో వీధిలైట్ల స్తంభాలకు రోప్‌లైట్స్ వేయిస్తే ప్రజాధనం వృథా అవుతుందని ఆ...అధికారికి తెలియక కాదు. కేవలం ఇందులో వచ్చే అధిక కమీషన్లకు కక్కుర్తి పడటమే కాకుండా 'జిల్‌జిల్ జిగెల్ల'తో తన పనితనం ఇదీ అంటూ ఎమ్మెల్యేలను ఆకట్టుకునేందుకు రూ. 10లక్షల దాక ప్రజధనాన్ని రోడ్డుపాలు చేశారు. ఆయన ఎంత తెలివైన అధికారి అంటే వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఆ పార్టీ జెండా కలర్లతో, ప్రస్తుతం టీడీపీ అధికారంలోకి రావడంతో ఆ పార్టీ జెండా పసుపు రంగు కలర్లను లెడ్ రూప్‌లైట్స్‌గా వేయించడం కొసమెరుపు. ఇదే నిధులతో వీధి దీపాల సెట్లను కొనుగోలు చేసి అంధకారంతో పాటు విష పురుగుల భయాలతో బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్న మురికివాడల్లో వెలుగులు పూయించి ఉంటే ఎంతో ఉపయోగకరంగా ఉండేది.



ఆదోని– కర్నూలు బైపాస్ రోడ్డులో వెలగకుండా అటకెక్కిన

**లైట్స్ కొనుగోలులోనూ నిధుల దుర్వినియోగంః**

రోప్‌లైట్స్ కొనుగోలు లోనూ నిధుల దుర్వినియోగం చోటు చేసుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. బహిరంగ మార్కెట్‌లో రంగురంగుల 'లెడ్ రోప్ లైట్స్' మీటర్ ధర రిటైల్‌లో రూ. 90 నుండి రూ. 100లోపు పలకుతుంది. అదే హోల్‌సెల్‌గా ఎక్కువ మీటర్లు కొనుగోలు చేస్తే రూ. 80ల ధాక ధర ఉంటుంది. అయితే పురపాలక సంఘం అధికారులు కమీషన్ల కోసం కాంట్రాక్టర్ కానీ ఓ ఎలక్ట్రికల్ దుకాణం యజమానికి ఇద్దరు కాంట్రాక్టర్లను పరిచయం చేసి వారి పేర్లపై అసలు, డమ్మి టెండర్లను ఎలక్ట్రికల్ దుకాణం యజమానితోనే వేయించారు. దీంతో ఆ దుకాణ యజమాని అధిక ధరకు టెండర్‌ను కోట్ చేసి దక్కించుకున్నారు. మార్కెట్‌లో మీటర్ రోప్‌లైట్ ధర రూ. 100లోపే ఉన్నా అధికారుల అండదండలతో మీటర్ రోప్‌లైట్‌కు రూ. 140 ధరను దుకాణ యాజమాని కోట్ చేశారు. అధికారుల ధనదాహం కారణంగా మీటర్‌కు రూ. 50లు పైనే పురపాలక సంఘం నష్టపోవాల్సి వచ్చింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఈ అవినీతిపై చర్యలు తీసుకోవడంతో పాటు నిర్వహణలో భాగంగా కాంట్రాక్టర్ చేత తిరిగి రోప్‌లైట్స్ వెలిగేలా చర్యలు తీసుకోవాలని పుర ప్రజలు కోరుతున్నారు.

**ఏఈ వివరణః** ఆదోని– కర్నూలు రహదారిలో అటకెక్కిన రోప్ లైట్స్‌పై మున్సిపల్ ఏఈ శరత్‌ను వివరణ కోరగా రూ. 4. 50లక్షలతో వేయించిన రోప్‌లైట్స్ వర్షాల వల్ల కొన్ని దెబ్బతిన్న మాట వాస్తవమేనన్నారు. ఏడాది పాటు కాంట్రాక్టర్ నిర్వహణ చేయాల్సి ఉండటంతో వాటిని మరమ్మత్తు చేయించి తిరిగి వెలిగేలా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

# మట్టి తరలింపును అడ్డుకోవద్దు



**వెల్దుర్తి రూరల్, మేజర్ న్యూస్ :** చెరువు మట్టి తరలింపును అడ్డుకుంటే కేసులు నమోదు చేస్తామని పోలీసులు బెదిరిస్తున్నారని వెల్దుర్తి మండలంలోని పిక్కిలివానిపల్లె గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ శివారులోని చెరువులోని మట్టిని ఇటుక బట్టీలకు అక్రమంగా తరలించేందుకు రావడంతో మంగళవారం గ్రామస్తులు అడ్డుకున్న సంగతి తెలిసిందే. గ్రామస్తులు ఒప్పుకోకపోవడంతో ఇటుకల బట్టి ఓనర్ నేను పర్మిషన్ తెచ్చుకున్నాను అంటూ కానీ ఆ పర్మిషన్ లెటర్‌లో ఇటికల్ బట్టి కి తోలడానికి లేదు అంటున్న గ్రామస్తులు పోలీసులపై ఒత్తిడి తెచ్చినట్లు తెలిసింది. ఈ విషయంపై మంగళవారం సాయంత్రం మాట్లాడుతున్న పిక్కిలివానిపల్లె గ్రామస్తులు గ్రామస్తులను వెల్దుర్తి పోలీస్ కార్యాలయానికి పిలిపించి మట్టి తరలింపును అడ్డుకుంటే గంజాయి, సారాయి కేసులు పెడతామని బెదిరించారని వాపోయారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

## ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

**ఉయ్యాలవాడమేజర్,న్యూస్ః** మండలంలో నేటి నుండి నిర్వహిస్తున్న ప్రత్యేక ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడివొ రఘురామ్ కోరారు. మండలంలోని వివిధ గ్రామాల్లో ఐదురోజులపాటు ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. 23వ తేదీన తుడుమలదిన్నె గ్రామ సచివాలయం 24,25 మాయలూరు సచివాలయం, 26,27వ తేదీల్లో హరివరం సచివాలయంలోను ఈ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. కాబట్టి ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిటీసీ సభ్యులు ప్రధానోపాధ్యాయులు , పంచాయితీ కార్యదర్శులు అందరూ ప్రజలకు సమాచారం అందజేసి ఈ క్యాంపులను విజయవంతం చేయాలన్నారు.

## ఆర్.అండ్.బి పనుల్లో లోపాలుంటే చర్యలు తప్పవు

**బనగానపల్లెమేజర్,న్యూస్ః** గత ప్రభుత్వ హయాంలో ఆర్.అండ్.బి పనుల్లో అవకతవకలు జరిగాయని అందుకు సంబంధించిన పూర్తి నివేదికను తెప్పించుకొని వాటిని పరిశీస్తామని రోడ్డు భవనాల శాఖా మంత్రి బి.సి జనార్ధన్ రెడ్డి తెలిపారు. మంగళవారంనాడు వారు అసెంబ్లీలో మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ధనార్జనే ధ్యేయంగా పనులు జరిగాయని ముఖ్యంగా రోడ్ల భవనాల మౌళిక వసతుల శాఖలో ఇలాంటి ఆరోపణలు ఎక్కువగా ఉన్నాయని వాటికి సంబంధించిన పూర్తి నివేదికను తెప్పించుకొని లోపాలుంటే సంబంధిత అధికారులు, కాంట్రాక్టులపై చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.



అసెంబ్లీలో మాట్లాడుతున్న మంత్రి బి.సి

# ఆళ్లగడ్డలో స్వాతంత్రోద్యమ నాయకుల జయంతి వేడుకలు



చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** ఆళ్లగడ్డ పట్టణంలోని కెవి సుబ్బారెడ్డి పాఠశాలలో స్వాతంత్రోద్యమ నాయకుల జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ప్రైవేట్ పాఠశాలల డివిజన్ అధ్యక్షులు అమీర్ భాష ఆధ్వర్యంలో కేవి సుబ్బారెడ్డి పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఓబన్న సమక్షంలో స్వరాజ్యమే నా జన్మ హక్కు అని చాటి చెప్పిన లోకమాన్య బాలగంగాధర్, బ్రిటిష్ వారి గుండెల్లో రైలు పరిగెత్తించిన అసమాన వీరుడు విప్లవ వీరుడు చంద్రశేఖర్ ఆజాద్ జయంతి వేడుకలను పురస్కరించుకొని వాని చిత్రపటాలకు పూలమాల వేసిన అర్పించారు. ఈ సందర్భంగా భారత్ మాతాకీ జై బాలగంగాధర్ తిలక్ కి జై చంద్రశేఖర్ ఆజాద్ జై వందేమాతరం జై భారత్ అంటూ నినాదాలతో ఘనమైన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# విభజిత ఏపీకి మేలుచేసేదిగా కేంద్ర బడ్జెట్



ఎంపీ బైరెడ్డి శబరి

(మొదటిపేజి తరువాయి..)

హైదరాబాద్-బెంగళూరు పారిశ్రామిక కారిడార్ అభివృద్ధికి ప్రత్యేక నిధులు, భారత ఆహార భద్రతకు పోలవరం ఎంతో కీలకమైందన్నారు. రాయలసీమ, ప్రకాశం, ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ కింద నిధులు, చిన్నమధ్య తరహా పరిశ్రమల అభివృద్ధికి ఆర్థిక సాయం, యువతకు ఉద్యోగ కల్పన, వంద నగరాల్లో ప్లగ్ అండ్‌ప్లే తరహాలో పారిశ్రామిక పార్కులు, అన్ని రంగాల్లో వెనుకబడ్డ రాయలసీమ, ఉత్తరాంధ్రకు ఈ బడ్జెట్ ఎంతో ఉపయోగం అన్నారు.

**డాక్టర్ చింతలమోహన్‌రావు, పీసీసీ ప్రధాన కార్యదర్శి :** ఆంధ్రప్రదేశ్‌కు బడ్జెట్‌లో అన్యాయం చేసిన కేంద్ర ప్రభుత్వం పీసీసీ ప్రధాన కార్యదర్శి చింతలమోహన్‌రావు ఆరోపించారు. కార్పొరేట్లకు ప్రైవేటీకరణకు, అనుకూలమైన బడ్జెట్‌లో ప్రధానమైన 9 అంశాలలో మొదటి అంశం వ్యవసాయానికి కేటాయిస్తున్నామని చెబుతూ నిధులు పెంచుతూనే అత్యధిక భాగం నిధులు వ్యవసాయ పరిశోధనకు కేటాయిస్తూ ఈ పరిశోధనలన్నీ కూడా ప్రైవేటు సంస్థలు ద్వారా చేయిస్తామని చెప్పడం చూస్తే భవిష్యత్తులో రైతులపై భారం ప్రజలకు ఆహార సంక్షోభం ఏర్పడక తప్పదన్నారు. ప్రజలపై భారాలు మోపే విధంగా బడ్జెట్ ఉందన్నారు.



డాక్టర్ చింతలమోహన్‌రావు

**రంగనాయుడు, సీపీఐ జిల్లా కార్యదర్శి :** కేంద్ర ప్రభుత్వం ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కార్పొరేట్లకు ప్రైవేటీకరణకు అనుకూలమైన బడ్జెట్‌గా ఉందని రాబోయే దక్షిణాది రాష్ట్రాల ఎన్నికల ను దృష్టిలో పెట్టుకుని ప్రవేశపెట్టిన బడ్జెట్ గా ఉందని రాష్ట్రానికి ప్రత్యేక హోదాపై ఏమాత్రం పెదవి ఇప్పకుండా అమరావతి రాజధానికి రూ. 15వేల కోట్లు కేటాయించా మని ప్రకటించడం రాష్ట్రానికి ద్రోహం చేసినట్లు అని అన్నారు.



రంగనాయుడు

**అభిరుచి మధు, బీజేపీ జిల్లా కో ఆర్డినేటర్ :** కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్ కు పెద్ద ఎత్తున నిధులు కేటాయించిన కేంద్ర ప్రభుత్వం అమరావతి నిర్మాణానికి ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రూ. 15వేల కోట్లు కేటాయిస్తూ అమరావతి నిర్మాణానికి పూర్తిగా సహకరిస్తామని తెలిపింది. పోలవరం నిర్మాణం త్వరగా పూర్తయ్యేలా నిధులు విడుదల వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి కేటాయించాల్సిన నిధులు రాయలసీమ, ప్రకాశం, ఉత్తరాంధ్రకు విడుదల చేసి అభివృద్ధికి సహకారం అందించడం, ఆర్థికంగా నష్టాల్లో ఉన్న ఆంధ్రప్రదేశ్‌ను కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం అన్ని రకాలుగా ఆర్థికంగా సహకరించి ఆంధ్రాకు అండగా ఉంటామని నిధుల కేటాయింపు ద్వారా తెలియచేసింది.



అభిరుచి మధు

# మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇద్దరు వ్యక్తులు అదృశ్యం



షేక్ షేక్షావలి (ఫైల్‌ఫోటో)

**కర్నూల్ క్రైమ్ మేజర్ న్యూస్ :** కర్నూల్ నగరంలోని మూడవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు వేరువేరు ప్రాంతాల్లో ఓ మహిళ ఓ యువకుడు అదృశ్యమైనట్లు మూడో పట్టణ ఎస్సై తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి.గణేష్ నగర్‌కు చెందిన ఎస్ షేక్షావలి 24 సంవత్సరాలు ఈనెల 10వ తారీఖున ఉదయం 7 గంటల సమయంలో ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదని అతని తల్లి షేక్ నసీమాబి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. అదేవిధంగా శ్రీరామ్ నగర్ చెందిన కే.లక్ష్మి 40సంవత్సరాలు ఈనెల 17వ తారీఖున ఉదయం 7 గంటల సమయంలో ఇంటి నుంచి వెళ్లిన మహిళ కూడా తిరిగి రాలేదని అతని కుమారుడు కే వీరేష్ ఇచ్చిన ఫిర్యాదు చేశారు. ఇరువురి బంధువులు మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మూడో పట్టణ ఎస్ఐ సిద్దయ్య తెలిపారు.



కే.లక్ష్మి (ఫైల్‌ఫోటో)

# నంద్యాల తహసిల్దార్ల పోస్టుల ఖరీదు రూ.2కోట్లు!

**నంద్యాల, మేజర్‌న్యూస్ బ్యూరో :** నంద్యాల జిల్లా కేంద్రంలోని నంద్యాల తహసిల్దార్లుగా వచ్చేందుకు తీవ్ర పోటీ నెలకొంది. జిల్లా కేంద్రం కావడంతో పాటు నంద్యాలలో భూముల ధరలు రూ.కోట్లు పలుకుతుండటంతో నంద్యాలకు వచ్చేందుకు తహసిల్దార్లు టిడిపి నేతలను ఆశ్రయిస్తున్నారు. ఏ చిన్న అవకాశాన్ని వదులుకొనేందుకు సైతం తహసిల్దార్లు ఇష్టపడటం లేదు. తమ రాజకీయ పలుకుబ డులను ఉపయోగిస్తూ టిడిపి ప్రజాప్రతినిధులు మంచి ఆఫర్లను ఇస్తున్నారన్న ప్రచారం నంద్యాలలో తీవ్ర చర్చనీ యాంశంగా మారింది. ప్రభుత్వం తహసిల్దార్ల బదిలీలకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో పోటీలో ఉన్న తహసిల్దార్లు నంద్యాలలో మకాం వేశారు. ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్లిన తహసిల్దార్లు ఒకటి, రెండు రోజుల్లో పాత జిల్లాలకు రానున్నారు. నంద్యాల నియోజకవర్గంలోని నంద్యాల అర్బన్, నంద్యాల రూరల్ తహసిల్దార్లుగా వచ్చేందుకు పోటీ ఎక్కువగా కనిపిస్తోంది. నంద్యాల అర్బన్ తహసిల్దార్ పోస్టును ఖరారు చేస్తే ప్రజాప్రతినిధులు, మధ్యవర్తలకు రూ.కోటిన్నర చెల్లించేందుకు ఇద్దరు తహసిల్దార్లు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. నంద్యాల రూరల్ తహసిల్దార్ పోస్టుకు సైతం రూ. 50 చెల్లించేందుకు ఒకరు సిద్ధపడినట్లు తెలుస్తోంది. నంద్యాల నియోజకవర్గంలోని మూడు తహసిల్దార్ల పేర్లు దాదాపు ఖరారైనట్లు ప్రచారం చివరి దశకు చేరుకుంది. గడిచిన ఐదేళ్లలో వైసీపీ ప్రజాప్రతినిధులతో అంటకాడిన తహసిల్దార్లు టిడిపి ప్రభుత్వంలో కీలకమైన నంద్యాల నియోజకవర్గ తహసిల్దార్లుగా ముగ్గురుకి టిడిపి ప్రజాప్రతినిధులు పచ్చ జెండా ఊపినట్లు విశ్వసనీయంగా తెలుస్తోంది. ఆ ముగ్గురు తహసిల్దార్లు తీవ్ర అవినీతి ఆరోప ణలు ఎదుర్కొంటున్నారు. జిల్లాలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న తహసిల్దార్లలో ఆ ముగ్గురు మొదటి ఐదు స్థానాల్లో ఉన్నట్లుగా రెవెన్యూ వర్గాల్లో చర్చ సాగుతున్న నేపథ్యంలో మేజర్‌న్యూస్ అందిస్తున్న కథనం ఇది.

నంద్యాల జిల్లా కేంద్రమైన నంద్యాలో రియల్ ఎస్టేట్ వ్యాపారం రూ.కోట్లలో సాగుతోంది. ఎకరం భూమి రూ.కోట్లలో ఉంటుంది. నంద్యాల పట్టణంతోపాటు శివారు ప్రాంతాల్లో వందల సంఖ్యలో వెంచర్లు వెలిశాయి. రాష్ట్రంలో అధికారం మార్పుతో రియల్ ఎస్టేట్ వ్యాపారం పూంజుకొనే అవకాశాలు కనిపిస్తున్నాయి. గడిచిన ఐదేళ్లలో రియల్ ఎస్టేట్ వ్యాపారం ఆశించిన స్థాయిలో లేకపోవడంతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు కోట్లలలో అప్పుల్లో మునిగిపోయాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారంతో ముడిపడిన దళారులు వ్యాపారాలు లేక ప్రత్యామ్నాయ జీవనోపాదులు వెతుక్కొనే పనిలో నిమగ్నమైన సమయంలో ప్రభుత్వం మారడంతో వారిలో ఆశలు చిగురిస్తున్నాయి. టిడిపి ప్రభుత్వంలో రియల్ ఎస్టేట్ వ్యాపారానికి అనువుగా ఉంటుందన్న ప్రచారం నేపథ్యంలో నంద్యాల తహసిల్దార్లుగా వచ్చేందుకు పలువురు పోటీ పడుతున్నారు. తహసిల్దార్ల ఎంపిక ప్రక్రియ చివరి దశకు చేరుకున్నట్లు రెవెన్యూ వర్గాల్లో వినిపిస్తుంది. నంద్యాల అర్బన్ తహసిల్దార్‌గా వచ్చేందుకు ఇద్దరు తహసిల్దార్ల మధ్య తీవ్ర పోటీ నెలకొన్నట్లు రెవెన్యూ వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. గతంలో నంద్యాల తహసిల్దార్‌గా పని చేసి తీవ్రమైన అవినీతి, అక్రమాల ఆరోపణలతో వైసీపీ నంద్యాల అధిష్టానం వేటు వేసిన ఒకరు నంద్యాల అర్బన్ తహసిల్దార్‌గా అవకాశం కల్పిస్తే రూ.కోటిన్నర చెల్లించేందుకు సిద్ధమన్న సంకేతాలను అందిస్తున్నారు. ప్రస్తుతం సదరు తహసిల్దార్ కడప జిల్లాలో పని చేస్తున్నారు. మరొక తహసిల్దార్ అంత మొత్తం చెల్లించలేనని పోటీ నుంచి తప్పుకున్నట్లు తెలుస్తోంది. తాజాగా నంద్యాలలో రియల్ ఎస్టేట్ వ్యాపారం గురించి తెలుసుకున్న తహసిల్దార్ ఒకరు పోటీలోకి వచ్చినట్లు తెలుస్తోంది. ఈ తహసిల్దారు రూ.కోటిన్నర చెల్లించేందుకు సిద్ధమని ముందుకు వచ్చినట్లు విశ్వసనీయంగా తెలుస్తోంది. ఇతను గతంలో కడప జిల్లాలో తహసిల్దార్‌గా పని చేస్తూ సార్వత్రి ఎన్నికల సమయంలో అనంతపురంకు బదిలీ అయ్యారు. ఇకపోతే నంద్యాల రూరల్ తహసిల్దార్‌గా అవకాశం కలిపిస్తే టిడిపి ప్రజాప్రతినిధులకు రూ. 50 లక్షలు చెల్లించగలన ని అధికారపార్టీకి చెందిన ఒక ముఖ్య నేత ముందు ప్రతిపాదనను ఉంచినట్లు తెలుస్తోంది. సదరు తహసిల్దార్ గతంలో పొరుగు నియోజకవర్గంలో పని చేసిన సమయంలో ప్రభుత్వ భూముల బదలాయింపుపై సస్పెండ్‌కు గురయ్యారు. అదే నియోజకవర్గంలోని ప్రక్క మండలంలో పని చేసే సమయంలో అవినీతి ఆరోపణలు తీవ్రస్థాయిలో ఎదుర్కొవడంతో జిల్లా ఉన్నతాధికారులు తమ పరిధిలో పని చేసే స్థానానికి బదిలీ చేశారు. ప్రస్తుతం తహసిల్దార్ ఎన్నికల్లో చిత్తూరు జిల్లాకు బదిలీ అయ్యారు. నంద్యాల నియోజకవర్గ పరిధిలోని గోస్పాడు తహసిల్దార్ పోస్టు కోసం నంద్యాల తహసిల్దార్ కార్యాలయంలో గతంలో నంద్యాలలో ఆర్ఐ గా పని చేసి నంద్యాల జిల్లాలోనే తహసిల్దార్‌గా పని చేస్తూ ఎన్నికల్లో భాగంగా చిత్తూరు జిల్లాకు బదిలీ అయ్యారు. ఆర్ఐగా, డిప్యూటీ తహసిల్దార్‌గా, తహసిల్దార్‌గా పని చేసే సమయంలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటూ జిల్లా ఉన్నతాధికారుల మందలింపుకు గురయ్యారు. ఇతను గోస్పాడు టిడిపి ప్రజాప్రతినిధులకు ముడుపు చెల్లించే స్థోమత తనకు లేదని తెగేసినట్లు చెప్పినట్లు తెలుస్తోంది. అయితే టిడిపి ప్రజాప్రతినిధులు పనులను తప్పక చక్కబెడతానన్న హామీని మాత్రం ఇచ్చినట్లు తెలుస్తోంది. మొత్తం మీద నంద్యాల జిల్లా కేంద్రంలోని తహసిల్దార్ల పోస్టులు దక్కించేందుకు రూ. రెండు కోట్ల చెల్లించేందుకు సిద్ధపడుతున్నారంటే ఆయా అర్బన్, మండలాల్లో ఎంత ఆదాయం ఉంటుందోనన్న ప్రచారం రెవెన్యూ శాఖను కుదిపేస్తుండటం కొసమెరుపు..

# అన్న క్యాంటీన్‌లకు పూర్వవైభవం..!

**పునరుద్ధరణ పనులు చేపడుతున్న పురపాలక సంఘం**

**ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్ :** నిరుపేదలకు తక్కువ ఖర్చుతో భోజనం అందించే అన్న క్యాంటీన్‌లకు పూర్వ వైభవం రానుంది. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత వీటి పునరుద్ధరణపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేయడంతో గతంలో నిర్వహించిన భవనాల్లోని తిరిగి వీటిని ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో క్యాంటీన్ భవనాలను సచివాలయాలుగా వినియోగించడంతో తిరిగి విటి స్వరూపం తీసుకు వచ్చినందుకు చర్యలు ప్రారంభించారు. రూ. 5కే భోజనం, అల్పాహారం లభించే రోజులు అతి దగ్గరలోనే ఉన్నాయి. అన్న క్యాంటీన్ పునరుద్ధరణకు ప్రభుత్వం చర్యలు చేపట్టడంతో పేదలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎమ్మిగనూరు పట్టణంలోని ప్రధాన రహదారి సోమప్ప సర్కిల్, శ్రీనివాస్ థియేటర్ ఎదురుగా రెండు అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేశారు. క్యాంటీన్లకు మంచి స్పందన కూడా వచ్చింది. అయితే గత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ కేంద్రాలను మూసివేశారు. ఈ భవనాలను సచివాలయ కార్యాలయాలుగా మార్పు చేశారు. ఇప్పుడు కూటమి


అన్న క్యాంటీన్ పునరుద్ధరణ పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేదలకు రూ. 5కే భోజనం అందించాలనే ఉద్దేశ్యంతో అదే భవనాల్లో క్యాంటీన్ల స్వరూపం తీసుకువచ్చేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. వీటితోపాటు త్రాగునీటి సదుపాయం, విద్యుత్ ఆధునికరణ పనులు చేపడుతున్నారు. ప్రస్తుతం ఆధునీకరణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఆగస్టు నాటికి పూర్తి స్థాయిలో రంగులు వేసి, బోర్డులను ఏర్పాటు చేసి సిద్ధంగా ఉంచేందుకు సన్నాహాలు చేపట్టారు.

# అస్వస్థతకు గురైన కూలీల ఘటనపై జిల్లా వైద్యాధికారి తనిఖీ..


హాస్పిటల్లో పర్యటిస్తున్న డీ ఎం అండ్ హెచ్ ఓ

**ఆళ్లగడ్డ, మేజర్‌న్యూస్ :** మండలంలోని యస్ .లింగందిన్నె గ్రామంలో గత సోమవారం పురుగుమందు ప్రభావంతో 20 మందికి పైగా కూలీలు అస్వస్థతకు గురై కొందరు నంద్యాల ఆసుపత్రిలో, కొందరు ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇందుకు సంబంధించి నంద్యాల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ మంగళవారం ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి సంఘటనపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురుగుమందు ప్రభావంతోనే వారు వసంస్థలకు గురి కావడం జరిగిందన్నారు. ప్రస్తుతం నంద్యాలలో చికిత్స పొందుతున్న వారంతా కోలుకున్నారని ఈరోజు సాయంత్రం డిశ్చార్జ్ చేస్తామని డాక్టర్ వెంకటరమణ తెలిపారు.

**సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి :** జిల్లాలో ప్రస్తుత వర్షాకాలంలో సీజనల్ వ్యాధులైన అతిసారం మలేరియా తదితర వ్యాధులు ప్రబలకుండా గట్టు చర్యలు తీసుకుంటున్నట్లు డిఎంహెచ్వో డాక్టర్ వెంకటరమణ తెలిపారు. ప్రజలు కూడా కలుషిత నీరు కలుషిత ఆహారం తీసుకోకుండా జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. వైద్య ఆరోగ్య సిబ్బంది కూడా గ్రామాలలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని డీఎంహెచ్వో డాక్టర్ వెంకటరమణ వివరించారు. ఈ సమావేశంలో ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ సుజాత కూడా పాల్గొన్నారు.

# విద్యార్థుల పట్ల జిల్లా అధికారుల నిర్లక్ష్య వైఖరి సరైనది కాదు

**సమాజ్‌వాది పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షులు శివకృష్ణయాదవ్**

**డోన్, మేజర్‌న్యూస్ః** విద్యార్థుల పట్ల జిల్లా అధికారుల నిర్లక్ష ్యవైఖరి సరైనది కాదని, అనుమతులు లేకుండానే ప్రైవేటు, కార్పోరేట్ విద్యాసంస్థలను నడుపుతున్నా జిల్లా విద్యాశాఖ యంత్రాంగం పట్టించుకోకపోవడం దారుణమని సమాజ్‌వాది పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షులు శివకృష్ణయాదవ్, ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజు, ఎన్ఎస్‌యుఐ నంద్యాల జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు తెలుగు విజయ్‌కుమార్‌లు ఆరోపించారు. మంగళవారం నంద్యాల జిల్లా కలెక్టర్‌రేట్ కార్యాలయం ఎదుల ధర్నా


డిస్ట్రిక్ట్ రెవెన్యూ అధికారిణీకు వినతిపత్రం ఇస్తున్న ఎన్ఎస్‌యుఐ నాయకులు

నిర్వహించి, అనంతరం కలెక్టర్ కార్యాలయంలోని డిస్ట్రిక్ట్ రెవెన్యూ అధికారిణీ పద్మజకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డోన్ పట్టణంలోని భాష్యం ఇంగ్లీష్ మీడియం స్కూల్‌కు ఎటువంటి అనుమతులు లేనప్పటికి నిర్మాణ దశలో ఉన్నటువంటి స్కూల్‌కు ఫైర్ సర్టిఫికేట్ అలాగే జిల్లా విద్యాధికారి ఏ విధంగా అనుమతులు ఇచ్చారో తమకు అర్థం కావడంలేదన్నారు. జిల్లా ప్రైవేట్, కార్పోరేట్ స్కూల దోపిడీకి హద్దు లేకుండా పోయిందని, ఎటువంటి నిర్మాణాలు పూర్తి కాకముందే, ఎటువంటి సేఫ్టీ పరికరాలు లేకుండానే విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని మండిపడ్డారు. కావున రాష్ట్ర స్థాయి విద్యాశాఖ అధికారులు విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యుఐ నాయకులు నూర్, జంబులయ్య, మధు, అజయ్, నవీన్, జగన్‌లు పాల్గొన్నారు.

# పంటసాగు పత్రాల తోనే కౌలు రైతులకు మేలు

**గోనెగండ్ల, మేజర్ న్యూస్ :** పంట సాగు పత్రాల వలన కౌలు రైతులు బహుల ప్రయోజనాలు పొందవచ్చునని జిల్లా వ్యవసాయశాఖ అధికారి వరలక్ష్మి అన్నారు. మంగళవారం తిప్పనూరు గ్రామంలో కౌలు రైతుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంట సాగు పత్రం అనేది భూమి యజమానికి సాగుదారుడికి మధ్య ఒప్పంద పత్రం. కావున ఈ పత్రాలు ఉంటే వారికి ఎంతోమేలు జరుగుతుందన్నారు. ఈ పత్రంకు 11 నెలలు మాత్రమే విలువ ఉంటుందని తెలిపారు. అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్, పంటల బీమా, పంటనష్ట పరిహారం, సున్నావడ్డీ, దాన్యం పండించిన తరువాత కొనుగోలు కేంద్రంలో అమ్మడానికి ఎంతో ఉపయోగపడుతుందన్నాని వారు తెలిపారు. ఈ హక్కు పత్రాలు ఎమ్మిగనూరు మండలంలో 965 మంది కౌలు రైతులకు, నందవరం మండలంలో 970 మంది కౌలు రైతులకు, గోనెగండ్ల మండలంలో 855 మంది కౌలు రైతులకు, మంత్రాలయం మండలంలో 810 మంది కౌలు రైతులకు ఈ పంట సాగు పత్రాలను ఇచ్చేందుకు వ్యవసాశాఖ అధికారులు సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

**అంటు వ్యాధులు సోక కుండా గట్టిచర్యలు తీసుకోవాలి :** గ్రామంలో అంటువ్యాధులు సోక కుండా గట్టి చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేక అధికారి జేడీ వరలక్ష్మి పంచాయతీ, వైద్యఆరోగ్యశాఖ సిబ్బందికి సూచించారు. మంగళవారం తిప్పనూరు గ్రామంలోని వీదులలో పర్యటించారు. స్కూల్ దగ్గర ఉన్న రోడ్డు పరిశీలించారు. గ్రామంలో శిథిలావస్థలకు చేరిన నీటి ట్యాంక్ను పరిశీలించారు. వీదులలో నిలిచిన వర్షం నీటిని వెంటనే తొలగించాలని ఎక్కువ రోజులునిలిచి ఉంటే దోమలు, ఈగలు ప్రభలుతాయని దాని ద్వార అంటువ్యాధుల ప్రభలే అవకాశం ఉంటుదని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది ఏడీఏ మహుమ్మద్ ఖాద్రీ, ఏవో హేమలత, గ్రామ సర్పంచ్ పాల్గొన్నారు.


కొర్ర పంటను పరిశీలిస్తున్న జేడీఏ

# స్టాప్ డయేరియాపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి

**చాగలమర్రి,మేజర్ న్యూస్ :** మండలంలోని మూడురాళ్ళపల్లెలో స్టాప్‌డయేరియా పై ముత్యా లపాడు వైద్యాధికారి తస్లీమా సుల్తానా ప్రజలకు మంగళవారం అవగాహన కల్పించా రు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ వర్షాకాలంలో నీరు కలుషితం కావడం వలన డయేరియా, ఆతసార వంటి వ్యాధులు వచ్చే ప్రమాదం వున్నందున ప్రతిఒక్కరు కాచి చల్లారిన నీటిని త్రాగాలన్నారు. చేతులు పరిశుభ్రంగా సబ్బునీటితో శుభ్రపరచుకొని, వేడివేడి ఆహార పదార్థములను భుజించాలన్నారు. డయేరియా వచ్చినప్పుడు ఆలస్యము చేయకుండా ఓఆర్ఎస్ మరియు జింక్ మాత్రలు వాడడం ద్వారా తీవ్రత తగ్గించడం ద్వారా ప్రాణాపాయం జరగకుండా కాపాడవచ్చన్నారు. అలాగే సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్లపై అవగాహన కల్పించారు. కార్యక్రమమలో ఆరోగ్యవిస్తరణ అధికారి వెంకటేశ్వర్లు,సిహెచ్ఓ చంద్రకళ, ఏఎన్ఎం వేదమణి,హెల్త్ అసిస్టెంట్ మనోహర్, అంగవాడి కార్యకర్త శోభ, ఆశాకార్యకర్త వరలక్ష్మి, గ్రామస్థులు పాల్గొన్నారు.

# పోస్టుమార్టం నివేదిక ఆధారంగానే చర్యలు

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** రుద్రవరం మండల పరిధిలోని ఆర్ నాగులవరం గ్రామంలో సోమవారం రాత్రి శ్రీ లక్ష్మి అనే వివాహిత మహిళ తన ఇంట్లో ఉన్న బాత్రూంలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన విషయం విధితమే. మంగళవారం పోస్టుమార్టంకొరకు మృతదేహాన్ని ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈసందర్భంగా సిరివెళ్ల సిఐ చంద్రబాబు మాట్లాడుతూ మృతురాలి తల్లి లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని అన్నారు. పోస్టుమార్టంనివేదికవచ్చాకనిందితులపైచట్టపరమైనచర్యలు తీసుకుంటామన్నారు.

## ఎండియు ఆపరేటర్‌తో 48 క్వింటాళ్ళ బడిబియ్యం ఇప్పించండి..?

**పెద్దకడుబూరు మేజర్ న్యూస్ :** పెద్దకడుబూరు మండల పరిధిలోని కల్లుకుంట జడ్పీ. ప్రాథమిక పాఠశాలకుసంబందించిన48క్వింటాళ్ళు బియ్యం ఎండియి ఆపరేటర్ ద్వారా ఇప్పించండంటూ కల్లుకుంట గ్రామానికి చెందిన జడ్పీ. ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు మంగళవారం విలేకరులకు తెలిపారు. అలాగే బియ్యం ఇవ్వాలని ఎండియు ఆపరేటర్ ప్రతిసారి అడిగినా ఏమాత్రం పట్టించుకోవడం లేదని వారు చెప్పారు. అలాగే గత సంవత్సరం2023. సెప్టెంబర్ 25వతేది సంవత్సరం నుంచి తమపాఠశాలకు అందాల్సిన మధ్యాహ్నం బడిబియ్యం ఎండియు ఆపరేటర్ ఇంత వరకు స్వాధీనం చేయడం లేదని తెలిపారు. దీంతో విద్యార్థులకు ఏలా భోజనం ఏర్పాటు చేయాలని వారు అన్నారు. పాఠశాలకు సంబంధించిన బడిబియ్యం కోసం ఎండియు ఆపరేటర్ చుట్టూ కాళ్లు అరిగెలా తిరిగినా అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేస్తున్నారే తప్పా తమకు బియ్యం ఇవ్వడం లేదన్నారు. పాఠశాలకు చెందాల్సిన బడిబియ్యం పై ఎండి యూ ఆపరేటర్ మీద మండల విద్యాశాఖ అధికారి. మండల తాహాశీల్దారుకు. ఎంఆర్ఐకి దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. అయిన అతడు మాత్రం ఏమాత్రం స్పందించడం లేదని వారు చెప్పారు. ఇప్పటికైనా మండల తాహాశీల్దారు స్పందించి తమ పాఠశాలకు అందాల్సిన 48క్వింటాళ్ళ బడి బియ్యం సంబంధిత ఎండియు ఆపరేటర్ ద్వారా ఇప్పించాల్సిందిగా వారు అధికారులను కోరుతున్నారు.

# అనుభవం గల నాయకుడు ముఖ్యమంత్రి చంద్రబాబు


సమావేశంలో మాట్లాడుతున్న టంగుటూరి శీనయ్య

**బనగానపల్లెమేజర్,న్యూస్ః** అనుభవం గల నాయకుడు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అని నంద్యాల జిల్లా తెలుగుదేశం పార్టీ వాణిజ్య విభాగాల అధ్యక్షుడు టంగుటూరి శీనయ్య పేర్కొన్నారు. మంగళవారం నాడు పట్టణంలోని ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అమరావతి అభివృద్ధికి 15కోట్లు నిధులు కేటాయించడం హర్షించదగ్గ విషయమన్నారు. అభివృద్ధి సంక్షేమం రెండు నేత్రాలుగా భావించి భవిష్యత్ కోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాటుపడుతున్నారన్నారు. బనగానపల్లె నియోజకవర్గం అభివృద్ధితోపాటు రాష్ట్రంలో ఉన్న రోడ్డు భవనాల అభివృద్ధికి చంద్రబాబు సహకారంతో రాష్ట్ర మంత్రి బి.సి జనార్ధన్ రెడ్డి పాటుపడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు నాగేందర్ రెడ్డి, ఖాదర్, జోలాపురం బాలక్రిష్ణ, హరిక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

# మహానందీశ్వరుని హుండీ ఆదాయం రూ.50.11లక్షలు

**మహానంది, మేజర్ న్యూస్ః** ప్రముఖ పుణ్యక్షేత్రమైన మహానందిలో భక్తులు సమర్పించిన కానుకల ద్వారా రూ. 50,11,101ల ఆదాయం లభించినట్లు ఆలయ ఈఓ శ్రీనివాస రెడ్డి తెలిపారు. మంగళవారం ఈఓ పర్యవేక్షణలో ఉభయ దేవాలయంల హుండీ లెక్కింపును అభిషేక మండపంలో నిర్వహించారు. 54 రోజులకు గాను ఈ మొత్తం లభించినట్లు ఈఓ పేర్కొన్నారు. ఆలయంలోని హుండీల ద్వారా రూ. 48,73,743లు రాగా అన్న ప్రసాదం హుండీ ద్వారా రూ. 1,18,327లు, గో సంరక్షణ హుండీ ద్వారా రూ. 19031లు కలిపి మొత్తంగా రూ. 50,11,101లు ఆదాయం వచ్చిందన్నారు. అలాగే యూఎస్ఏ వివిధ రకాల డాలర్లు 12 వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ తరుపున చక్ర భరత్, ఏఈఓలు మధు, వెంకటేశ్వర్లు, ఇన్స్‌పెక్టర్ శశిధర్ రెడ్డి, తిరుమలబాలాజీసేవాసమితిసభ్యులు,ఆలయసిబ్బంది పాల్గొన్నారు.


మహానంది క్షేత్రంలో హుండీ లెక్కింపు చేస్తున్న దృశ్యం

సూర్య

బుధవారం | 24 జులై 2024

### రోగులకు అందుబాటులో ఉంటూ

# వైద్య సేవలు అందించాలి

### – యాళ్లూరు ఆసుపత్రిని తనిఖీ చేసిన కలెక్టర్



యాళ్లూరు ఆసుపత్రి వైద్యులను వివరాలు అడుగుతున్న కలెక్టర్

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** సామాజిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి వైద్య సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం గోస్పాడు మండలం యాళ్లూరు గ్రామంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రంలో వైద్యులు రోగులకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, మరుగుదొడ్లు, తాగునీరు తదితర సదుపాయాలపై పేషేంట్లను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో రోజుకు ఎన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు, అత్యవసర సమయాలలో ఎవరెవరు పనిచేస్తున్నారు ఏ సమయం నుంచి వైద్య సర్వీసులు అందిస్తున్నారు వైద్య పరికరాల కొరత ఏమైనా ఉందా తదితర అంశాలపై కలెక్టర్ వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆసుపపత్రిలో చిన్నపిల్లల డాక్టర్ అవసరం ఉందని వైద్య సిబ్బంది కలెక్టర్‌కు నివేదించారు. అలాగే 2020 సంవత్సరం నుంచి ఆసుపత్రి భవనం నిర్మాణంలో ఉందని పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. నిర్మాణంలో ఉన్న అసంపూర్తి ఆసుపత్రి భవన నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వివరించారు. సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశుభ్రంగా ఉంచుకుంటూ ప్రజలకు అందుబాటులో ఉండడంతో పాటు మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని కలెక్టర్ వైద్య సిబ్బందిని ఆదేశించారు.



రోగులను వైద్య చికిత్సలపై అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్

# నాగనాథనహళ్ళి గ్రామంలో ఆకస్మిక తనిఖీలు

### – పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యం చూపిన వారిపై చర్యలు
### – ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని సబ్ కలెక్టర్ తనిఖీ

**ఆదోని, మేజర్‌న్యూస్ :** పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యం చూపిన వారిపై చర్యలు తీసుకుంటామని సబ్ కలెక్టర్ శివ నారాయణశర్మ పేర్కొన్నారు. మంగళవారం ఆదోని మండలం నాగనాథనహళ్ళి గ్రామంలో ఉన్న తాగునీటి ట్యాంకులను ఆకస్మికంగా సబ్ కలెక్టర్ తనిఖీ చేశారు. గ్రామంలో ప్రభుత్వం మౌళిక వసతులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ముందుగా ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన నాణ్యతను చూసి పరిశీలించారు. అనంతరం తరగతి గదిలో విద్యార్థుల యొక్క చదువులను వారి నైపుణ్యాలను అడిగి తెలుసుకున్నారు. పిల్లల భోజనంలో నాణ్యతను పెంచి మంచి పౌష్ఠిక ఆహారాన్ని విద్యార్థులకు అందజేయాలని సంబంధిత అధికారులకు సబ్ కలెక్టర్ ఆదేశించారు.

**గ్రామంలో శానిటేషన్ సబ్ కలెక్టర్ పరిశీలన**

నాగనాథనహళ్ళి గ్రామంలో శానిటేషన్‌పై అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామంలో పేరుకుపోయిన మురికి కాల్వల చెత్తను చూసి పంచాయతీపై సెక్రటరీ ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిసరాల పరిశుభ్రంగా ఉంటేనే రోగాలు రాకుండా ఉంటాయని సబ్ కలెక్టర్ సూచించారు. గ్రామంలో పంప్‌హౌస్,చెరువు, తాగునీటి పరీక్షలను తనిఖీ చేసి పరిశీలించారు. ప్రతి రోజు ఇంజనీరింగ్ అసిస్టెంట్లు గ్రామాల్లో తాగునీటికి సంబంధించిన పరీక్షలను ఎప్పటికప్పుడు పరిశీలించి, ప్రజలకు ఏటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ హసినా సుల్తానా, డిఎల్‌డిఓ నాగేశ్వరరావు, ఉప తహశీల్దార్ వలి బాష, రెవిన్యూ ఇన్స్‌పెక్టర్ ఖాసీం, సంబంధిత అధికరారులు పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

### జిల్లాలో 38 శాతం లోటు

# వర్షపాతం నమోదు



**కర్నూలు నగరం, మేజర్‌న్యూస్:** జిల్లాలో గత 10రోజులుగా వర్షాలు కురుస్తున్నా సగటున ఏ రోజు కూడా 10ఎంఎం వర్షపాతం నమోదు కాని పరిస్థితి నెలకొంది. అయితే వాటిలో 19వతేదీ రాత్రి 14మండలాల్లో భారీ వర్షం, నాలుగు మండలాల్లో మోస్తరు, ఏడు మండలాల్లో చిరుజల్లులు కురువగా, చిప్పగిరి మండలంలో ఇప్పటి వరకు చినుకు జాడనే లేదు. వాస్తవానికి విత్తనాలు విత్తుకోవడానికి పదునైన వర్షం పడాలంటే 20ఎంఎం వర్షపాతం నమోదు కావాలి. జిల్లాలో 26మండలాలు ఉండగా వాతావరణ శాఖ అధికారులు ఒక్కో మండలంలో ఇంత వర్షం కురవాల్సి ఉందని అంచనా వేశారు. అయితే ఆ అంచనాలకు తగ్గట్టుగా ఏ మండలంలో కూడా సరైన వర్షపాతం నమోదు కాలేదు. అయితే క్రిష్ణగిరి మండలంలో సాధారణ వర్షపాతం 83.6ఎంఎం కాగా ఇప్పటి వరకు 82.5, కర్నూలు అర్బన్ 121.3ఎంఎం కాగా 106.8ఎంఎం, వెల్దుర్తి 99.5ఎంఎం కాగా 82.2ఎంఎం, మంత్రాలయం 85.0ఎంఎం కాగా 69.6వర్షపాతం నమోదై కొంత ఫర్వాలేదనిపించింది. మిగతా మండలాల్లో సాధారణ వర్షపాతం కంటే తక్కువగా నమోదు కావడం గమనార్హం. 22వతేదీ రాత్రి 17మండలాల్లో చిరుజల్లులు మాత్రమే కురిశాయి.

## నిఫా వైరస్‌ను ఎదుర్కోవడానికి ముందు జాగ్రత్తలు

### – జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి



సమీక్ష నిర్వహిస్తున్న దృశ్యం

**కర్నూలు క్రైమ్, మేజర్‌న్యూస్:** ఇతర రాష్ట్రాల్లో నమోదైన నిఫా కేసుల దృష్ట్యా ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో నిఫా వైరస్‌ను ఎదుర్కోవడానికి ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నట్లు జీజీహెచ్ సూపరింటెండెంట్ సి.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం జీజీహెచ్‌లో నిఫా వైరస్‌పై హెచ్‌ఓడీలతో సమీక్ష సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. ఆసుపత్రిలో ఐడీ బ్లాక్‌లో ఆరు పడకలను నిఫా వైరస్‌కు కేటాయించామన్నారు. ఆసుపత్రిలోని సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. పీపీఈ కిట్‌లకు సంబంధించి తగినంత స్టాక్ అందుబాటులో ఉందన్నారు. యాంటీ వైరల్ డ్రగ్స్ రిబావిరిన్, ఫ్లావిపావిర్, అత్యవసర ఔషదాలు అందుబాటుల ఉండేలా సర్జికల్ అండ్ మెడికల్ స్టోర్‌లకు ఆదేశించినట్లు తెలిపారు. ఆసుపత్రిలో ఇప్పటి వరకు ఎలాంటి నిఫా వైరస్ కేసు నమోదు కాలేదన్నారు. ఈ సమావేశంలో హెచ్‌వోడీలు, డాక్టర్లు ఇక్బాల్‌హుసేన్, లక్ష్మిభాయ్, విద్యాసాగర్, శివనాయక్, కొండారెడ్డి, వెంకటేశ్వరరావు, హేమనళిని పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలను పారదర్శకంగా పరిష్కరిస్తాం

### టిడిపి జాతీయ ఉపాధ్యక్షులు, డోన్ ఎమ్మెల్యే కోట్ల



ప్రజల నుండి వినతులను స్వీకరిస్తున్న టిడిపి జాతీయ ఉపాధ్యక్షులు, ఎమ్మెల్యే కోట్ల

**డోన్, మేజర్‌న్యూస్ :** రాష్ట్రంలోని ప్రజల సమస్యలను పారదర్శకంగా పరిష్కరించేందుకు తెలుగుదేశం పార్టీ కట్టుబడి ఉందని తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు, డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయం నందు ఎమ్మెల్యే కోట్ల ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజలు, కార్యకర్తల నుండి వచ్చిన వినతులను స్వీకరించారు. ఇందులో కొన్ని సమస్యలను సంబందిత అధికారులతో మాట్లాడి అక్కడిక్కడే పరిష్కరించి, మిగిలిన సమస్యలను పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు, సంబందిత మంత్రులు, వివిధ శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించేలా కృషి చేస్తామన్నారు. అనంతరం ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డిని కలవడానికి ఉమ్మడి కర్నూలు జిల్లా నుండి కోడుమూరు, కర్నూలు, డోన్, మంత్రాలయం, ఎమ్మిగనూరు, ఆలూరు, పత్తికొండ, ఆదోని నియోజకవర్గల టిడిపి నేతలు పెద్దఎత్తున పార్టీ కేంద్ర కార్యాలయానికి తరలివచ్చారు.


మట్టి దొంగల దోబుచులాట..!!

### సెటిలర్ బరితెగింపు..

# ఓ యువకుడితో బెదిరింపు

- సామాజిక మధ్యమాల్లో హెచ్చరికలు
- పత్రిక స్వేచ్ఛకు ఆటంకపరిచే యత్నం
- కాసుల దందా పైన టీడీపీలో పెదవి విరుపు

**ఎమ్మిగనూరు, మేజర్‌న్యూస్ ప్రతినిధి :** అధికారంలోకి టీడీపీ వచ్చాక ఎక్కడో వున్న వారంతా పాలకుల దగ్గర చేరుకొని సంపాదన మార్గాలు వేసుకునే యత్నంలో ముందుంటారు. అలాంటి కోవలోనే ఎమ్మిగనూరులో బతుకు దెరువుకు వచ్చిన ఓ సెటిలర్ కాసుల దందాకి తెర లేపుకొన్నారు అనే బలమైన ఆరోపణలు టీడీపీ వారే చేస్తున్నారు. ఎమ్మిగనూరు నియోజకవర్గంలో వున్న చెరువులో మట్టి ఇటుకల బట్టీలకు అమ్ముడు పెట్టారని వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. ఇటుకల బట్టి వారికీ మట్టి అక్రమంగా అందించే యత్నంలో లక్షలు ముట్టినట్టు అందుకు "మట్టి దొంగల దోబుచులాట" అన్న కథనం ఈనెల 22 వ తేదీన నేటి దినపత్రిక సూర్య లో వచ్చిన విషయం పాఠకులకు విధితమే.. దీనిపై ఆ సెటిలర్ బరితెగించి సామజిక మధ్యమాల్లో ఓ యువకుడితో వార్త కథనం తప్పు దోవ పట్టించే కుటిల యత్నాలకు పూనుకున్నాడు. ఏకంగా బెదిరింపులకు దారులు వేశాడు. మరోసారి వార్తలు రాస్తే నీ అంతు చూస్తామన్న సాంకేతాలు అందిస్తున్నాడు. ప్రతి దానికి ఓ రేటు.. ఆయన రూటే సపరేటు అన్న నానుడితో పోతున్నా ఆ సెటిలర్ ఎమ్మిగనూరు టిడిపిలోనే ప్రతి నాయకుడు ప్రతి కార్యకర్త పెదివి విరుచుకునేలా యత్నాలు కొనసాగిస్తున్నాడు.. దోపిడీ అంతా ఎమ్మిగనూరు నందవరం మండలం ప్రాంతాల నుండి దోచుకుంటున్నా సెటిలర్ గోనెగండ్ల మండలంలోని యువకుడి చేత పత్రికా స్వేచ్ఛ గొంతు నొక్కడానికి యత్నిస్తున్నాడు. పార్టీని అడ్డుపెట్టుకొని ఒక్క ఇటుకల బట్టిలకే ఎలాంటి అనుమతులు ఇప్పించకుండా రూ.30 లక్షల ముడుపులు డిమాండ్ చేసినట్లు ఎమ్మిగనూరు ప్రాంతంలో బలమైన ఆరోపణలు ఉన్నాయి. ఈ ఆరోపణలు పత్రికకు రావడంతో జీర్ణించుకోలేని ఆ సెటిలర్ మరో ఐదేళ్లలో ఇంకా ఏ ఏ దందాలు నడపాలి అనుకుంటున్నాడో కానీ ముందుగానే ఇలాంటి బెదిరింపులు చేపడితే ఇక్కడ నాయకుల పేరు చెప్పి దోచుకోవాలని యత్నిస్తున్నట్లు అర్థమవుతుంది. ఇటుక బట్టీలకు మట్టినితోలే అనుమతులు పొందాలంటే ఐదు శాఖల అధికారులతో అనుమతులు ఉండాలి. అలాంటివి ఉంటే ఎందుకు చెరువులో మట్టిని తోడడానికి దోబూజులాడుతున్నారు దీన్ని బట్టి అర్థమవుతుంది. గతంలో ఆ యువకుడు చాలామందిని విమర్శించిన దాఖలాలు కూడా లేకపోలేదు. ఇలాంటి వ్యక్తులపై పాలకులు, అధికారులు చర్యలు తీసుకోకపోతే అధికార పార్టీకి ఎమ్మిగనూరులో మరింత చెడ్డ పేరు వచ్చే అవకాశం ఉంది.